


మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

# ఇండస్ట్రియల్ కారిడార్ కల నెరవేరేనా!?




## ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ఎన్నో అవకాశాలు

**పారిశ్రామిక ప్రగతి కోసం ప్రతి నియోజక వర్గంలో ఇండస్ట్రియల్ పార్కులు అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో... కొత్త పరిశ్రమల ఏర్పాటుపై నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకవైపు వ్యవసాయం విస్తృతంగా సాగుతుండగా, మరోవైపు పలురకాల ఖనిజ సంపద నెలకొంది. ఉమ్మడి జిల్లాలో దశాబ్దాల క్రితమే ఐటీసీ, బీపీఎల్, హెవీవాటర్ ప్రాజెక్టు, సింగరేణి, కేటీపీఎస్, స్పాంజ్ ఐరన్, నవభారత్, పాలేరు షుగర్స్, కాకతీయ షుగర్స్ వంటి భారీ పరిశ్రమలు వచ్చాయి. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే స్థాపితమయ్యాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాత్రం భద్రాద్రి పవర్ ప్రాజెక్టు రావడం జరిగింది.**

- ఇప్పటికే పురోగమిస్తున్న పామాయిల్ రంగం
- పత్తి, మిర్చి, పండ్ల ఆధారిత యూనిట్లకు ఉజ్వల భవిష్యత్తు
- వరంగా మారిన పుష్కలమైన నీటిపారుదల సౌకర్యాలు
- రోడ్డు, రైలు రవాణా సౌకర్యాల కల్పనే కీలకం
- దశాబ్దాల క్రితం కాంగ్రెస్ సర్కారు స్థాపించిన పరిశ్రమలే ఇప్పటికీ...
- ముగ్గురు మంత్రులు, ఎంపీలు తలుచుకుంటే పరిశ్రమల స్థాపన సులువు
- ఆశలు రేకెత్తిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఇండస్ట్రియల్ పాలసీ

ఖమ్మం, జూలై 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాలో గ్రానైట్, ఐరన్ ఓర్, బెరైటీస్ తదితర ఖనిజ సంపదలున్నాయి. సుమారు 400వరకు చిన్న, పెద్ద గ్రానైట్ పరిశ్రమలు, మిర్చి ఆధారిత చైనా పరిశ్రమ, మధుకాన్ షుగర్స్, కాకతీయ షుగర్స్‌తో పాటు 40కి పైగా రైస్‌మిల్లులు, 25 జిన్నింగ్ మిల్లులు, ఒక స్పిన్నింగ్ మిల్లు ఉన్నాయి. సత్తుపల్లి బుగ్గపాడులో మెగా ఫుడ్‌పార్కు కూడా ఏర్పాటు చేశారు. అయితే ఫుడ్‌పార్కుకు రైలు, రోడ్డు రవాణా దగ్గరగా లేకపోవడంతో ప్రైవేటు పరిశ్రమలు రాలేకపోతున్నాయి.

ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాగ్‌పూర్-అమరావతి, ఖమ్మం-దేవరపల్లి, ఖమ్మం-కోదాడ తదితర జాతీయ రహదారులు కూడా రాబోతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త పరిశ్రమలు ఈ హైవేలకు అనుసంధానంగా వస్తే పారిశ్రామిక ప్రగతికి అవకాశం ఉంటుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడున్నర లక్షల ఎకరాల పత్తి, లక్షన్నర ఎకరాల్లో మిర్చి, సుమారు 5లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఇవి కాకుండా పలురకాల పప్పు ధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఆయిల్‌పామ్ కూడా ఉమ్మడి జిల్లాలో సుమారు 25 వేల ఎకరాల్లో సాగవుతోంది. అశ్వారావుపేట, అప్పారావుపేటలో ఆయిల్‌పామ్ పరిశ్రమలున్నాయి.

కొత్తగా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి సమీపంలో ఆయిల్‌పామ్ పరిశ్రమతో రిఫైన్డ్ ఆయిల్ పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆయిల్‌పామ్‌తో పాటు మిర్చి, పత్తి, మొక్కజొన్న ఆధారిత పరిశ్రమలకు మామిడి, వరి, తదితర పంటల ఆధారిత పరిశ్రమలకు ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లకు ఉమ్మడి జిల్లాలో అవకాశాలు మెండుగా ఉన్నాయి. జిల్లాలో జామ, బొప్పాయి, మామిడి తదితర రకాల పండ్లతోటలు పెద్దఎత్తున సాగవుతున్నాయి. వాణిజ్య, ఆహార, పండ్ల తోటలు, కూరగాయల సాగుకు పుష్కల అవకాశాలు ఉన్నందున వ్యవసాయాధారిత పరిశ్రమలకు జిల్లాలో డిమాండ్ ఉంది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలోనూ ఇండస్ట్రియల్ పార్కులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టాలని బడ్జెట్‌లో ప్రతిపాదించింది. పరిశ్రమల కారిడార్, ఫుడ్‌పార్క్‌లు ఏర్పాటుచేసే ప్రాంతాలు రోడ్లు, రైలు రవాణాకు అనుసంధానంగా ఉంటే అక్కడ పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు ఆసక్తిచూపే అవకాశం ఉంటుంది. రవాణా సౌలభ్యం లేకుండా దూరప్రాంతాల్లో స్థలాల ఎంపిక జరిగినా పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిదారులు వచ్చే అవకాశం ఉండదు.



బుగ్గపాడులోని మెగా ఫుడ్‌పార్కు

### రా.. రమ్మని..

ఉమ్మడి జిల్లాలో లక్షల సంఖ్యలో నిరుద్యోగులు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు కోసం ఎదురుచూస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం ఉండడంతో అక్కడ పరిశ్రమల ఏర్పాటుకు గిరిజనేతర ప్రైవేటు పెట్టుబడిదారులు వచ్చే అవకాశం లేదు ప్రభుత్వ ఆధారిత పరిశ్రమలు మాత్రమే పెట్టే అవకాశం ఉంది. ప్రభుత్వం దగ్గర నిధులు లేనందున ఇది సాధ్యం కాని పని. బయ్యారం వంటి ఉక్కు పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నా ప్రైవేటు సంస్థలతో సాధ్యమవుతుంది. షెడ్యూల్డ్ ఏరియాలో 1/70 చట్టం ఆటంకంగా ఉన్నందున ప్రైవేటు వ్యక్తులు పరిశ్రమలు పెట్టలేని పరిస్థితి. అందువల్ల ప్రైవేటు వ్యక్తులు పెట్టుబడులు పెట్టడం, బ్యాంకు రుణాలతో పరిశ్రమలు స్థాపించడం సాధ్యమవుతుంది.

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తుల లభ్యతను బట్టి పరిశ్రమల ఏర్పాటుకు జిల్లాకు చెందిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ సభ్యులు ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం అవసరమైతే ప్రభుత్వ భూములు గుర్తింపు, ఏ ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమల ఏర్పాటుకు సౌలభ్యం, అక్కడ లభించే ముడిసరుకు, రైలు, రోడ్డు మార్గాలను గుర్తించి ప్రైవేటు పారిశ్రామికవేత్తలతో ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తే జిల్లాలో కొత్త పరిశ్రమలకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

వీటితోపాటు స్వయం సహాయక సంఘాలు, కుటీర పరిశ్రమలకు కూడా అవకాశాలు అధికం. మామిడి, టమాట వంటి కూరగాయలు, పండ్లు ద్వారా కూడా కుటీర పరిశ్రమలకు మెరుగైన అవకాశాలు జిల్లాలో ఉన్నాయి. ఇందుకు అవసరమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శిక్షణ సంస్థలు నెలకొల్పి శిక్షణ కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. డెయిరీ, కోళ్లు, చేపల పెంపకం వంటి వ్యవసాయాధారిత కుటీర పరిశ్రమలకు అవకాశాలు అధికంగా ఉన్నాయి. జిల్లాలో గ్రానైట్ పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వ్యర్థాలను కూడా వినియోగంలోకి తెచ్చేలా చిన్నతరహా పరిశ్రమలు, ఉప ఉత్పత్తుల తయారీకి కూడా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలున్నా ఇందుకు అవసరమైన కార్యాచరణ లేకపోవడంతో ప్రతిఏటా కొత్త పరిశ్రమలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి.

## సూర్యాపేట హైవేలో మరో ఫ్లైఓవర్

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి ఫలితం
- త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం
- ఖమ్మం-సూర్యాపేట వెళ్లే వాహనదారులకు తీరనున్న కష్టాలు

ఖమ్మం, జూలై 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఖమ్మం-సూర్యాపేట హైవేలో సూర్యాపేట ఎంట్రీ వద్ద కొత్త ఫ్లైఓవర్ రాబోతుంది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ ఫ్లైఓవర్ కోసం గతంలోనే కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి లేఖ రాశారు. ఫ్లైఓవర్ లేకపోవడంతో జరుగుతున్న ప్రమాదాల గురించి బ్లాక్‌స్పాట్స్ గుర్తించి వివరంగా లేఖలో తెలియచేయడంతో, నేషనల్ హైవే అథారిటీకి వెంటనే మంజూరు ఇచ్చింది. టెండర్లు కూడా పూర్తికావడంతో త్వరలో పనులు ప్రారంభం కాబోతున్నాయి. ఈ క్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు... రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో బుధవారం చర్చించారు. దేవరపల్లి-ఖమ్మం గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులు పూర్తవుతున్న నేపథ్యంలో విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాల రాకపోకలు కూడా ఖమ్మం సూర్యాపేట రహదారి మీద నుంచి జరగనున్నందున ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయితే సూర్యాపేట - ఖమ్మం రహదారి రాకపోకలు సులభంగా ఉంటాయని, ప్రస్తుతం సూర్యాపేట వరకు వచ్చి యూటర్న్ తీసుకొని వెళ్లాల్సి వస్తుందని, దీంతో పలుచోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

### ఎడమ కాలువకు రేపు సాగర్ జలాల విడుదల

ఎగువ నుంచి వస్తున్న వరదతో నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిండుతున్నందున ఖమ్మం జిల్లాలోని సాగర్ ఎడమ కాలువకు నీరు విడుదల చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు... భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌తో తుమ్మల భేటీ అయ్యారు. సాగు, తాగు అవసరాల కోసం పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ జలాలు విడుదల చేయాలని తుమ్మల కోరగా, ఆగస్టు 2న సాగర్ జలాలు విడుదల చేస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.

## స్వల్పంగా తగ్గుతున్న గోదావరి

### భద్రాద్రి వద్ద కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

భద్రాచలం, జూలై 31: ఎగువ భాగాన కురిసిన భారీ వర్షాలతో భద్రాచలం వద్ద పెరుగుతూ వచ్చిన గోదావరి నీటిమట్టం కొద్దిసేపు నిలకడగా ఉండి అనంతరం స్వల్పంగా తగ్గుతోంది. మంగళవారం అర్ధరాత్రి 12గంటలకు 43.8 అడుగులున్న గోదావరి నీటిమట్టం ఉదయం 6 గంటలకు 44.6, 9గంటలకు 45 అడుగులు, 11 గంటలకు 45.1 అడుగుకు పెరిగింది. అనంతరం నాలుగు గంటల పాటు నిలకడగా ఉన్న గోదావరి నీటిమట్టం క్రమేపి స్వల్పంగా తగ్గుతోంది. సాయంత్రం 45 అడుగులున్న గోదావరి నీటిమట్టం 6 గంటలకు 44.9 అడుగులకు తగ్గింది. గురువారానికి గోదావరి నీటిమట్టం మరింతగా తగ్గే అవకాశాలున్నట్టు అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదిలా ఉండగా భద్రాచలం గోదావరి స్నానఘట్టాలపైనుంచి వరద ప్రవాహం ప్రవహిస్తోంది.

## భర్త వియోగం భరించలేక...



- దివంగత కాంగ్రెస్ నేత జక్కంపూడి కృష్ణమూర్తి భార్య ప్రేమలత బలవన్మరణం
- అర్ధరాత్రి ఇంటి బావిలో దూకి ఆత్మహత్య
- భర్త లేని లోకంలో తానుండలేనని ఐదు రోజులుగా దుఃఖం
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు, బంధువులు
- జీవిత పర్యంతం భర్త అడుగుజాడల్లో పయనం
- రెండు పర్యాయాలు సర్పంచ్‌గా సేవలు
- తల్లాడ మండలం బిల్లుపాడులో తీవ్ర విషాదం

వివరాలు : 6లో

## రూ.వెయ్యి కొట్టు.. రూ.50వేలు పట్టు..

- ఫైనాన్స్ పేరుతో చర్ల మండలంలో ఘరానా మోసం
- 300 మంది మహిళల నుంచి నగదు వసూలు
- ఫోన్‌లు స్విచ్ఛాఫ్ చేయడంతో అనుమానం
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు

చర్ల, జూలై 31: ఏజెన్సీ ప్రాంతంలో అమాయక మహిళలను లక్ష్యంగా చేసుకొని కొంతమంది కేటుగాళ్లు మోసానికి పాల్పడ్డారు. రూ.1,000చెల్లిస్తే రూ.50 వేలు ఇస్తామని నమ్మించి చీటింగ్ చేశారు. భద్రాద్రి జిల్లా చర్ల మండలంలో జరిగిన ఈ మోసంపై బాధిత మహిళలు బుధవారం చర్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కొత్తగూడేనికి చెందిన కొంతమంది చర్ల మండలంలో బ్రోకర్లను ఏర్పాటు చేసుకుని అనేక గ్రామాల్లో మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. తమకు కొత్తగూడెంలో ఫైనాన్స్ సంస్థ ఉందని, ప్రతీ కుటుంబానికి రూ.50వేలు ఫైనాన్స్ ఇస్తామని నమ్మించారు. డాక్యుమెంట్ చార్జీల కింద ప్రతీ మహిళ రూ.1,000 చెల్లించాలని సూచించారు. దీంతో అనేకమంది డబ్బు చెల్లించారు. ఇలా చర్ల మండలవ్యాప్తంగా సుమారు 300మంది మహిళలనుంచి వెయ్యి చొప్పున వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఇలా డబ్బు వసూలు చేసిన వ్యక్తులు చివరికి నగదు ఇవ్వకపోగా, తమ ఫోన్‌లు స్విచ్‌ఆఫ్ చేయడంతో బాధిత మహిళలు కొత్తగూడెంలోని ఆ ఫైనాన్స్ సంస్థ కార్యాలయానికి వెళ్లగా.. తమకు ఎలాంటి సంబంధం లేదని అక్కడ నిర్వాహకులు చెప్పడంతో తాము మోసపోయామని తెలుసుకుని బుధవారం చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధిత మహిళలు

## రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- ధరణి సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- 'ప్రజావాణి' దరఖాస్తులను వేగంగా పూర్తి చేయాలి
- నిర్ణీత సమయంలోగా ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి
- తహసీల్దార్లతో సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



సమీక్ష సమావేశానికి హాజరైన తహసీల్దార్లు



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 31: 'రెవెన్యూ సంబంధ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి... ఎక్కడా ఇబ్బందులు లేకుండా జాగ్రత్తగా చూడాలి' అని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో ధరణి, ప్రజావాణి, ధ్రువీకరణలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల స్థాయిలో రెవెన్యూ వ్యవస్థ పటిష్టంగా ఉండాలని, ప్రజల సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని డీటీ, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ అన్ని కేటగిరీలకు చట్టాలపై అవగాహన కలిగేలా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ధరణి దరఖాస్తులు సమర్పించేటప్పుడు మాడ్యూల్ ప్రకారం సంబంధిత అన్ని డాక్యుమెంట్లు జతచేయాలన్నారు. డాక్యుమెంట్ల పరిశీలన పక్కాగా చేయాలన్నారు.

ప్రతి దరఖాస్తు సమర్పించిన నెలలోనే పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ప్రతి మండల తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ధరణి సహాయక కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని, దరఖాస్తు పెట్టే ముందు దరఖాస్తుదారునికి పూర్తి అవగాహన కలిగేలా గైడ్ చేయాలన్నారు. ప్రతి సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని చేపట్టాలని, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు ప్రజావాణిలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం సాయంత్రం శాఖలవారీగా దరఖాస్తుల పరిష్కారంపై నివేదిక సమర్పించాలని అన్నారు. ప్రతి శుక్రవారం శాఖాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, స్వీకరించిన అర్జీలపై తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగొద్దని కలెక్టర్ అన్నారు. ఎస్టీ, ఎస్సీ, మానవ హక్కుల, గ్రీన్ ట్రిబ్యునల్ తదితర కమిషన్లకు నివేదికలు సమయంలోగా సమర్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

తహసీల్దార్లు జారీచేసే కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువీకరణల దరఖాస్తులు నిర్ణీత సమయంలోగా జారీ అయ్యేలా చూడాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తుల పరిశీలన పెండింగులు లేకుండా వెంట వెంటనే పూర్తి చేయాలన్నారు. విలువైన ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఫెన్సింగ్, ప్రభుత్వ భూమి అని నామసూచికల ఏర్పాట్లు చేయాలన్నారు. చెరువుల భూముల విషయమై ఇరిగేషన్, రెవెన్యూ, గూగుల్ మ్యాపులు సరిచూసుకొని భూముల ఆక్రమణలు కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఆర్డీవోలు జి.గణేష్, ఎల్.రాజేందర్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ శ్రీనివాసులు, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

### మత్స్య తంత్రం..



వైరాలో మత్స్యకారుల చేపల వేట



## ఊరించి ఉసూరుమనిపించి...

- వైరా రిజర్వాయర్‌లో చేపల వేట షురూ
- తొలిరోజు మత్స్యకారులను నిరాశ పరిచిన దిగుబడి
- పెట్టుబడి కూడా వస్తుందో.. రాదోనని నిర్వేదం

వైరా, జూలై 31: వైరా రిజర్వాయర్‌లో తగ్గిన చేపల దిగుబడి వందలాదిమంది మత్స్యకారులను తీవ్ర నిరాశకు గురిచేసింది. సుమారు నాలుగునెలలు రిజర్వాయర్‌లో నీటి లభ్యత లేక వేట ఉంటుందో లేదోనని ఊగిసలాటలో ఉన్న మత్స్యకారులు ప్రస్తుతం రిజర్వాయర్‌లో 12అడుగులకుపైగా నీరు వచ్చిచేరడంతో బుధవారం చేపల వేటకు శ్రీకారం చుట్టారు. అనేక నెలల నుంచి పనులు లేక కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మత్స్యకారులు ఎన్నో ఆశలతో చేపలవేట చేపట్టగా తొలిరోజే వారి ఆశలు అడిశయాలయ్యాయి. మొదటిరోజు సుమారు 200టన్నుల చేపల దిగుబడి వస్తుందని ఆశించిన మత్స్యకారులు కేవలం 50నుంచి 60టన్నుల దిగుబడి మాత్రమే రావడంతో నిరాశకు లోనయ్యారు. ఈ చేపల వేటకోసం ఒక్కో మత్స్యకారుడు రూ.20నుంచి రూ.40వేల వరకు పెట్టుబడి పెట్టి వలలు, తెప్పలు సమకూర్చుకున్నారు.

చేపల వేట ద్వారా పెట్టిన పెట్టుబడితోపాటు కనీసం కొన్నినెలలపాటు కుటుంబ జీవనం సాఫీగా సాగేందుకు ఆదాయం వస్తుందని ఆశించినా చివరికి అది అడియాశే అయ్యింది. మూడు మండలాల్లోని 11 గ్రామాలకు చెందిన వందలాదిమంది మత్స్యకారులు చేపల వేట చేశారు. వీరిలో కొద్దిమందికి మినహా ఎక్కువమంది సభ్యులకు 30 నుంచి 40కిలోల చేపలు మాత్రమే పడ్డాయి. ముందుగా ఒక కంపెనీకి చేసుకున్న విక్రయ ఒప్పందం మేరకు సహకార సంఘానికి చెందిన వ్యాపారుల ద్వారా మత్స్యకారులు ఆ చేపలను కంపెనీకి విక్రయించారు.వైరాలో చేపలవేట జరుగుతుండటంతో వైరా పరిసర ప్రాంతాలకు చెందిన వందలాదిమంది చేపల కోసం రిజర్వాయర్ వద్దకు ఎగబడ్డారు. అయితే స్థానికులకు చేపలు దొరక్కపోవడంతో తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. సంబంధిత మత్స్యశాఖ అధికారులు స్థానికులకు చేపలు విక్రయించేలా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తాయి.

### జాడ లేని 'సుడా'



- గట్టయ్య సెంటర్‌లో కార్యాలయం మూసివేత
- ఏడు నెలల క్రితం పాలకవర్గం రద్దు
- కేఎంసీకి కార్యాలయ సిబ్బంది కేటాయింపు

6

### ఎంబీఏ ఖాదర్.. మిరప సాగులో సూపర్

- స్వయం ఉపాధి కోసం ఆధునిక వ్యవసాయం
- అనుభవంతో మిరప నర్సరీ ఏర్పాటు
- ఆదర్శంగా నిలుస్తున్న యువరైతు





ప్రకృతి సంతకం

అన్నదాత చెమటచుక్కలతో నిండిన చెలిమతో చెలిమి చేస్తానంటూ తొంగి చూస్తున్న సూరీడు అబ్బురపరుస్తున్నాడు. దేశానికి అన్నంపెట్టే మాగాణి మడిలో నిటారుగా నిల్చున్న మట్టిపార ముచ్చట చెప్తున్నట్లుగా ఉంది. ఎర్రుపాలెం మండలంలోని తెల్లపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం వరిపైరుకోసం సిద్ధం చేసిన మాగాణిలో కనిపించిన ప్రకృతి చిత్తరువును ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది.

- ఎర్రుపాలెం

# జాడ లేని 'సుడా'

- గట్టయ్య సెంటర్‌లో కార్యాలయం మూసివేత
- ఏడు నెలల క్రితం పాలకవర్గం రద్దు
- కేఎంసీకి కార్యాలయ సిబ్బంది కేటాయింపు
- సమాచారం చెప్పే వారు లేక జనం వెతలు

ఖమ్మం కార్పొరేషన్, జూలై 30: ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటుచేసిన స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) కార్యాలయం మూతపడింది. ఖమ్మం నగరంలోని గట్టయ్యసెంటర్‌లో డీసీసీబీ కార్యాలయ భవనంలో 'సుడా' కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వహయాంలో నియమించిన వివిధ కార్పొరేషన్ చైర్మన్ల పదవులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయగా, 'సుడా' చైర్మన్‌తోపాటు 13 మంది సలహా సంఘ సభ్యుల పదవులు రద్దయ్యాయి. అప్పటి నుంచి 'సుడా' కార్యాలయం మూతపడింది. 'సుడా' కార్యాలయంలో పనిచేసే పలువురు సిబ్బందికి నగరపాలకసంస్థ కార్యాలయంలో విధులు అప్పగించారు. పాలకవర్గం రద్దు కావటంతో డీసీసీబీ అధికారులు తాము 'సుడా'కు ఇచ్చిన భవనాన్ని స్వాధీనం చేసుకోగా, ప్రస్తుతం కార్యాయానికి తాళం పడింది. కాగా కార్యాలయాన్ని నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని అనుకున్నా తరువాత ఆ ప్రతిపాదనను విరమించుకున్నారు.



మూతపడిన సుడా కార్యాలయం

**పాలకవర్గం నియమించకపోవటంతో..**

పాలకవర్గాన్ని నియమించకపోవటంతో ప్రస్తుతం కలెక్టర్ 'సుడా' చైర్మన్‌గా, నగరపాలకసంస్థ కమిషనర్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. నగరపాలకసంస్థ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసే ఉద్యోగికి 'సుడా' బాధ్యతలు అప్పగించారు. ఇక లేఅవుట్ల అనుమతులు తదితర వివరాల కోసం గతంలో 'సుడా' కార్యాలయంలో సంప్రదించేవారు. ఆన్‌లైన్ విధానంలో ఏవైనా సందేహాలు ఉన్నా కార్యాలయంలో అడిగి తెలుసుకునేవారు. తమ దరఖాస్తుల గురించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేవారు. ప్రస్తుతం పాలకవర్గం లేకపోవటంతోపాటు కార్యాలయాన్ని మూసివేయటంతో సిబ్బంది అందుబాటులో లేక సమాచారం చెప్పేవారే లేరు.



## నూతన గవర్నర్‌కు మంత్రి తుమ్మల శుభాకాంక్షలు

ఖమ్మం, జూలై31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా నియమితులై బాధ్యతలు చేపట్టిన జిష్ణు దేవ్‌వర్మను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం

- జూలైలో గరిష్ఠంగా 896 మిల్లీమీటర్ల వర్షపాతం
- ఉత్పత్తి ఆటంకాన్ని పూడ్చవచ్చు..
- సింగరేణి మణుగూరు ఏరియా జీఎం రామచందర్



జీఎం కార్యాలయంలో సమావేశం మందిరంలో మాట్లాడుతున్న జీఎం రామచందర్

మణుగూరుటౌన్, జూలై 31: సింగరేణి కాలరీ మణుగూరు ఏరియాలో గత ఏడాది కన్నా ఈ ఏడాది ఏరియాలో వర్షాలు ఎక్కువగా నమోదయ్యాయని, దానవల్ల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగిందని ఏరియా జీఎం దుర్గం రామచందర్ అన్నారు. బుధవారం ఏరియా జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాలో గత ఏడాదితో పోలిస్తే వర్షాపాతం ఎక్కువగా నమోదైందన్నారు. జూలై మాసంలోనే గరిష్ఠంగా 896 ఎం.ఎం. వర్షపాతం నమోదుకాగా ఈ ఏడాది సరాసరి ఇప్పటివరకు 1,486 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు. కాగా ఏరియాకు జూలై మాసానికి నిర్ధేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 7.98 లక్షల టన్నులకు గాను 8.46 లక్షల బొగ్గు ఉత్పత్తి చేసి 106 శాతం సాధించినట్లు తెలిపారు. ఈ ఏడాది ఎప్రిల్ 1వ తేది నుంచి జూలై 31వ తేది వరకు సరాసరి 41.89 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 41.23 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 98 శాతం సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్పత్తికి తగిన విధంగా 8.27 లక్షల బొగ్గు రవాణా చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో సరాసరి 39.74 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసిట్లు తెలిపారు. జూలై మాసానికి 11 లక్షల ఓవర్ బర్డెన్ వెలికితీయాలన్న లక్ష్యంలో 54 శాతం ఓబీ వెలికి తీశామన్నారు. కాగా సరాసరిగా 73 శాతం ఓబీ వెలికి తీసామన్నారు. ఏరియాలో పారిశ్రామిక సంబంధాలు మెరుగ్గానే ఉన్నాయని, ఇందులో భాగంగానే 18 మంది కార్మికులకు సీఎంపీఎఫ్, పెన్షన్ సెటిల్ చేశామని, 14 మందికి గ్యాట్యూటీని సెటిల్ చేశామన్నారు. నలుగురికి కాంపన్‌సేషన్ కింద ఉద్యోగాలివ్వగా. దాదాపు పది మందికి క్యాడర్ ప్రమోషన్‌లను ఇచ్చామన్నారు.

మణుగూరు ఏరియాలో ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న వర్షాల వలన జరిగిన బొగ్గు ఉత్పత్తి ఆటంకాలను పూరించవచ్చని ఏరియా జీఎం రామచందర్ అన్నారు. ఏరియాలో అత్యధిక వర్షాపాతం నమోదకావడంతో పాటు జల్లులతో కూడిన ఎడతెరిపి లేని వర్షంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకమేర్పడిందన్నారు. ఈ సమావేశంలో ఎస్వోటు జీఎం శ్యాం సుందర్, అధికారులు లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాస చారి, సలగల రమేష్, వెంకటరావు, అనురాధా, సింగు శ్రీనివాస్, డి. వెంకటేశ్వర్లు, షబ్బీరుద్దీన్ పాల్గొన్నారు.

# నో సిగ్నల్..

- ఏపీజీవీబీ బ్యాంక్‌లో వారం నుంచి సాంకేతిక సమస్య
- యూపీఐ, ఏటీఎం వినియోగదారుల ఇబ్బందులు
- ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులు

కరకగూడెం, జూలై 31: కరకగూడెం మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస (ఏపీజీవీబీ) బ్యాంక్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. ఫలితంగా ప్రధాన సర్వర్‌తో సంబంధంలు తెగిపోవడంతో వారం రోజులకు పైగా యూపీఐ, ఏటీఎం సిగ్నల్స్ పనిచేయడం లేదు. దీతో మండలంలోని ఏపీజీవీబీ ఖాతాదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎస్‌బీఐ ఆర్‌ఆర్‌బీ టెక్నికల్ సమస్యలతో సిగ్నల్ రావడం లేదని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు.

నగదు కోసం మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 15 నుంచి 20 కిలోమీటర్ల దూరం నుంచి బ్యాంక్ వద్దకు వస్తున్న ప్రజలకు బ్యాంక్‌లో సిగ్నల్ సమస్యలతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా ఏపీజీవీబీ బ్యాంక్ ఖాతాదారులు 12 00 ఉన్నారు. ఇందులో పలు సంఖ్యలో మహిళా సంఘాల గ్రూపుల వారు, పింఛన్‌దారులు, వ్యాపారులు నగదు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. వివిధ గ్రామాల నుంచి ఇక్కడకు వచ్చే వరకు యూపీఐ, ఏటీఎం సిగ్నల్స్ లేక బ్యాంక్ వద్ద బారులు తీరుతున్నారు. ఇప్పుడు మండల వ్యాప్తంగా ఎక్కువగా ప్రజలు యూపీఐ, ఏటీఎంలా ద్వారా రోజువారిగా కోట్లల్లో నగదు బదిలీలు ఎక్కువగా చేస్తున్నారు. పలు రోజులుగా సిగ్నల్ పనిచేయక పోవడంతో అనేక సమస్యలు ఎదురుకుంటున్నారు. అంతేకాక మండలంలోని పింఛన్‌దారులు బ్యాంకు నుంచి ఏర్పాటు చేసిన బ్యాంక్ మిత్రల వద్ద నగదు తీసుకుంటారు. కానీ బ్యాంకుమిత్రల వద్ద సిగ్నల్ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఆధార్ కార్డు ద్వారా మండలంలోని వివిధ గ్రామాలలో మినీ ట్రాన్సఫర్ కేంద్రాల వద్ద నగదు తీసుకునే వారు.. అక్కడ సిగ్నల్స్ పనిచేక పోవడంతో నగదు కోసం పాట్లు తప్పటం లేదు. అధికారులు స్పందించి తక్షణమే యూపీఐ, ఏటీఎం, బ్యాంక్ మిత్రలకు సిగ్నల్స్ వచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



సిగ్నల్ లేక పోవడంతో బ్యాంక్ వద్ద ఖాతాదారుల ఇబ్బందులు

# భర్త వియోగం భరించలేక..

- దివంగత కాంగ్రెస్ నేత జక్కంపూడి కృష్ణమూర్తి భార్య ప్రేమలత బలవన్మరణం



తల్లాడ, జూలై 31: ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, తల్లాడ సొసైటీ మాజీ చైర్మన్ జక్కంపూడి కృష్ణమూర్తి ఇంట్లో మరో విషాదం నెలకొంది. ఆయన భార్య బిల్లుపాడు మాజీ సర్పంచ్ ప్రేమలత (68) బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. భర్త వియోగంతో మానసికంగా కుంగిపోయిన ప్రేమలత బావిలో దూకి ప్రాణాలు తీసుకుంది. ఈ ఘటనతో తల్లాడ మండలం బిల్లుపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి. భార్యాభర్తలిద్దరూ ఐదురోజుల వ్యవధిలోనే దూరం కావడంతో వారి కుటుంబసభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఐదు దశాబ్దాల అన్యోన్య దాంపత్య జీవితంలో భర్త అడుగుజాడల్లో నడిచిన ప్రేమలత.. కుటుంబ బాధ్యతలే కాకుండా భర్తతో కలిసి సామాజిక బాధ్యతలను కూడా భుజాన వేసుకున్నారు. కడుపున పుట్టిన పిల్లల జీవితాలను తీర్చిదిద్దడంతోపాటు తమను నమ్ముకున్న గ్రామప్రజలకు చేదోడువాదోడుగా నిలిచారు. అనునిత్యం భర్తతోనే తన ప్రయాణమంటూ శ్వాసించిన ఆమె చివరికి మరణంలోనూ భర్తకు తోడుగా వెళ్లారు. అనారోగ్యంతో ఐదురోజుల క్రితం ప్రేమలత భర్త కృష్ణమూర్తి మృతిచెందిన విషయం విధితమే. కృష్ణమూర్తి మరణించినప్పటి నుంచి వారింట్లో ప్రేమలతతో పాటు కుమారులు కిషోర్, రాము, ఆడబిడ్డలు బోజెడ్ల జయప్రద, సంక్రాంతి రాధమ్మ, సామినేని వాణిశ్రీ, సోదరులు సంక్రాంతి భాస్కర్‌రావు, సామినేని రమేష్‌లు కలిసి ఉంటున్నారు. అయితే మంగళవారం అర్ధరాత్రి రెండున్నర గంటల తర్వాత అందరూ గాఢనిద్రలో ఉన్న సమయంలో ప్రేమలత ఇంటి దక్షిణం వైపు తలుపు తీసుకొని వెళ్లి ఇంటి వెనుక పెరట్లోని బావిలో దూకింది. బుధవారం తెల్లవారుజామున 5:30 గంటల సమయంలో కుటుంబసభ్యులు నిద్రలేచి చూడగా ప్రేమలత మంచంపై కనిపించలేదు. భర్త చనిపోయినప్పటి నుంచి ప్రేమలత తన భర్త లేకపోతే తానెందుకుంటానని సమీప బంధువులతో అన్నమాటలు గుర్తుకు వచ్చి పెరట్లోని బావి వద్దకు వెళ్లి చూడగా ప్రేమలత విగతజీవిగా కనిపించింది. దాంతో మృతదేహాన్ని కుటుంబసభ్యులు వెలికితీశారు. ప్రేమలత ఆత్మహత్యతో కుటుంబసభ్యులందరూ కన్నీరుమున్నీరుగా విలపించారు.

**53ఏళ్ల అన్యోన్య దాంపత్యం..**

1971లో కృష్ణమూర్తి-ప్రేమలతల వివాహమైంది. అప్పటి నుంచి 53 ఏళ్ల పాటు భార్యాభర్తలు అన్యోన్య జీవితం గడుపుతున్నారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు కిషోర్ హైదరాబాద్‌లో కాంట్రాక్టర్‌గా పని చేస్తుండగా, చిన్నకుమారుడు రాము అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడ్డాడు. 1978నుంచి 48ఏళ్లపాటు జక్కంపూడి కృష్ణమూర్తి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ముఖ్య అనుచరుడిగా ఉంటూ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. భర్తకు చేదోడువాదోడుగా ఉంటూ ఆయన ప్రోత్సాహంతో ప్రేమలత 2013, 2019లో రెండు పర్యాయాలు బిల్లుపాడు పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికై పదేళ్లపాటు గ్రామాభివృద్ధికి కృషి చేశారు.

బిల్లుపాడు గ్రామానికి పెద్ద దిక్కు అయిన కృష్ణమూర్తి, ప్రేమలత దంపతులు ఐదురోజుల వ్యవధిలోనే మృతిచెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రేమలత ఆత్మహత్యపై తల్లాడ పోలీసులు కేసు నమోదుచేశారు. ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ప్రేమలత భౌతికకాయానికి జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం, రాష్ట్ర పోలీసు హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ పుతుంబాక శ్రీకృష్ణమూర్తి, సొసైటీ చైర్మన్లు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దిరిశాల నర్సింహారావు, ఎంపీటీసీలు దగ్గుల రఘుపతిరెడ్డి, కొమ్మినేని ప్రభాకర్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు దుండేటి వీరారెడ్డి, దీవెల కృష్ణయ్య, వివిధ పార్టీల నాయకులు కాపా సుధాకర్, కొమ్మినేని వెంకటేశ్వర్లు, దుగ్గిదేవర వెంకట్‌లాల్, కూచిపూడి వెంకటేశ్వర్లు, జక్కంపూడి నాగేశ్వరరావు, డాక్టర్ సామినేని వెంకటేశ్వరరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

## 4న సీనియర్ అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 31: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలో అండర్- 23 సీనియర్ మెన్, ఉమెన్స్ విభాగాలలో అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ షఫీక్‌అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. వయస్సు 18 సంవత్సరాలు పూర్తిగా నిండిన క్రీడాకారులు తమ పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో ఉదయం 8 గంటలకల్లా స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

## కూడళ్లలో మైకుల ఏర్పాటుకు చర్యలు

భద్రాచలం, జూలై 31: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో మైకులు ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. స్వామి వారి భక్తి గీతాలు, భక్తరామదాసు, తూము నరసింహదాసు కీర్తనలతో పాటు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంబంధించిన ప్రసారాలను మైకుల ద్వారా చేయనున్నారు. దాత సహకారంతో సుమారు రూ.4 లక్షల వ్యయంతో ఆలయం నుంచి తాతగుడి మరియు ఆలయం నుంచి అగ్నిమాపక శాఖ కార్యాలయంతో పాటు ఇతర త్రా ప్రాంతాల్లో ఈ మైకులను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. ఆగస్టు 20 నాటికి ఈ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

## అతిథి అధ్యాపకులకు దరఖాస్తులు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై31: జిల్లాలోని కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి 12మంది అతిథి అధ్యాపకులు, ఆరుగురు నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి కె.రవిబాబు తెలిపారు. ఈనెల 3న సాయంత్రం 5గంటలలోపు బయోడేటా విద్యార్హత సర్టిఫికెట్లతో జిల్లా ఇంటర్మీడియెట్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఇంగ్లీష్1,తెలుగు1, సంస్కృతం1, గణితం1, ఫిజిక్స్1, కెమిస్ట్రి1, బోటని1, జువాలజీ1, ఎకనామిక్స్1, సివిక్స్1, కామర్స్1, హిస్టరి1లో ఖాళీలత పాటు నాన్‌టీచింగ్ స్టాఫ్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, వాచ్‌మెన్ ఖాళీలకు దరఖాస్తులను అందించాన్నారు.

## భూసేకరణ వేగిరం చేయాలి

- అదనపు కలెక్టర్ డి. మధుసూదన్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 31: నేషనల్ హైవే ప్రాజెక్టు పనులకు భూసేకరణ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. బుధవారం ఆయన నేషనల్ హైవే ధంసలాపురం ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ కోసం భూసేకరణను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ లో భూమి కోల్పోతున్న రైతులకు సరైన నష్ట పరిహారం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. నేషనల్ హైవే, రోడ్లు భవనాల ఇంజనీరింగ్ అధికారులు పెగ్ మార్క్ చేసి, కావాల్సిన భూసేకరణకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు.

## కబడ్డీ అసోసియేషన్‌ను బలోపేతం చేయాలి

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 31: జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ను సంస్థాగతంగా బలోపేతం చేయాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు తీర్మానించారు. బుధవారం నగరంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఆఫీస్ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆగస్టు 20 తేదీ కల్లా జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించుకోవాలని నిర్ణయించారు. త్వరలో మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు, అనంతరం జరిగే రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ పోటీల నిర్వహణ ఏర్పాట్లపై దృష్టి సారించాలని నిర్ణయించారు.

## సంక్షేమ అధికారులతో డీజీఎం సమీక్ష

మణుగూరుటౌన్, జూలై 31: సింగరేణి మణుగూరు ఏరియా జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం డీజీఎం పర్సనల్ సలగల రమేష్ ఏరియా సంక్షేమ విభాగం అధికారులు, పీవోఏలు, అన్ని విభాగాల మినిస్టిరియల్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం 2021, 2022, 2023 సంవత్సరంలో గౌర్హాజరు కార్మికుల చార్జీషీట్‌లు, విచారణ ప్రక్రియను సమీక్షించారు. ఇతరాత్ర కారాణాలతో చార్జీషిట్ పొందిన కార్మికుల విచారణ స్టేటస్‌ను అడిగి తెలుసుకున్నారు. అర్హతగల ఉద్యోగల ప్రమోషన్ పాలసీల అమలుకు పాటించాలని నియమాలను వివరించారు.



పాఠశాలలో మధ్యాహ్న భోజనం పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్

## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 31: ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తున్నామని, సద్వినియోగం చేరుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టర్, నగరంలోని రోటరీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసి, బుధవారం పాఠశాల భోజనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో బోధన జరుగుతున్నట్లు తెలిపారు. విద్యార్థులతో మమేకమై విద్యా ప్రమాణాలు పరిశీలించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఇచ్చారా, పాఠ్య పుస్తకాలు అందించారా, పాఠ్యాంశాలు జరుగుతున్నాయా, మధ్యాహ్న భోజనం నాణ్యత వివరాలు కలెక్టర్ అడిగీ తెలుసుకున్నారు. పాఠశాలలో త్రాగునీరు, టాయిలెట్లు, కనీస వసతులు పరిశీలించారు. రోటరీ నగర్ పాఠశాల విద్యార్థులకు క్రీడల కోసం ఏర్పాట్లకు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, పాఠశాల హెచ్‌ఎం పి. పద్మ, ఉపాధ్యాయులు డీవీ. నాగేంద్ర బాబు, తదితరులు ఉన్నారు.

# ఎంబీఏ ఖాదర్ మిరప సాగులో సూపర్

- స్వయం ఉపాధి కోసం ఆధునిక వ్యవసాయం
- అనుభవంతో మిరప నర్సరీ ఏర్పాటు
- దారుగబంజరలో పలువురికి ఉపాధి మార్గం
- ఆదర్శంగా నిలుస్తున్న యువరైతు ఖాదర్



తన నర్సరీలో నారు నాణ్యత పరిశీలిస్తున్న ఖాదర్



కల్లూరు, జూలై 31: పట్టభద్రుడైన ఓ యువకుడు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను వదులుకొని వ్యయసాయ రంగంపై ఆసక్తి చూపాడు. నాలుగు సంవత్సరాలుగా మిరప నర్సరి క్షేత్రాన్ని ఏర్పాటు చేసుకొని పలువురికి ఉపాధి బాట చూపుతూ ఇతరులకు ఆదర్శంగా నిలిచాడు. కల్లూరు మండలంలోని దారుగబంజరు గ్రామానికి చెందిన ఎస్‌కే ఖాదర్ ఎంబీఏ చదివాడు. తన తండ్రి వ్యవసాయం పై పడుతున్న కష్టానికి ప్రతిఫలంగా పెట్టుబడిపై వస్తున్న ఆదాయాన్నిదృష్టిలో ఉంచుకొని సాగు వైపు అడుగులు వేశాడు. ఖాదర్ మిరప నర్సరీని పరిమితంగా ఏర్పాటు చేశాడు. ఉద్యానశాఖ అధికారుల సలహాలు, సూచనలను పాటిస్తూ నర్సరీని విస్తరిస్తూ దారుగ బంజరు పరిసర ప్రాంతంలో ఆదర్శంగా నిలిచాడు. వ్యవసాయ రంగంలో నూతన పరిజ్ఞానంపై పట్టు సాధించి మార్గదర్శకంగా నిలిచాడు.

**చీడపీడలు తట్టుకునేలా...**

ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 500 ఎకరాలకు సరిపోను మిరప నారును తన నర్సరీలో పెంచాడు. చీడ పీడలు, వైరస్‌లను తట్టుకునేలా నాణ్యమైన మిర్చి నారును సాగు చేశాడు. ఇలా మిరప నారులో మైకో, సెమిస్, కార్తికేయ, సకాట వంటి తదితర పది రకాల మిర్చి విత్తనాల నారును పెంచుతున్నాడు.

**15 మందికి ఉపాధి**

4.50 ఎకరాల స్థలంలో సుమారు రూ. 80 లక్షలు పైగా పెట్టుబడితో షేడ్‌నెట్లు, గ్రీన్ చాంబర్ తరహాలో సిద్ధం చేసి డ్రిప్ ఇరిగేషన్ ద్వారా మొక్కలకు నీటిని సరఫరా చేస్తున్నాడు. నర్సరీలోను మిర్చి మొక్క బలంగా తయారయ్యే విధంగా తగిన ఎరువులు వేసి వైరస్‌ను తట్టుకునే విధంగా మొక్కను పెంచుతున్నాడు. 4 నెలలు పాటుగా సుమారు 15 మంది కూలీలకు ఉపాధి కల్పిస్తున్నాడు.

**అధిక దిగుబడులు గ్యారెంటీ: ఎస్‌కే ఖాదర్, యువ రైతు**

దారుగబంజరు గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలో ప్రతి రోజు క్షేత్ర సందర్శన చేస్తూ మిరప మొక్కలకు సస్య రక్షణ చర్యలు చేపడుతున్నా. మిర్చి మొక్క ఆరోగ్యంగా పెరిగే విధంగా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఈ నర్సరీలో పెంచే మిర్చి మొక్కలు ఎకరానికి 13 వేల నారు సరిపోతుంది. గత నాలుగు సంత్సరాలుగా మిర్చి నర్సరీని ఏర్పాటు చేసి పలు ప్రాంతాల్లోని వేలాది మంది రైతులకు మొక్కలను అందజేశాను. ఆగస్టు నెల నుంచి మిరప నారు రైతులకు పంపిణీ జరుగుతుంది. పది మందికి ఉపాధి కల్పించాలన్నదే నాఆశయం. ఈ నర్సరీ సాగులో ఉద్యాన అధికారుల సలహాలు, సూచనలతో ముందుకు సాగుతున్నా.



# ఆపద్బాంధవులు


దుమ్ముగూడెం మండలం పెద్దనల్లబెల్లిలో వరద బాధితులను ఆదుకునేందుకు వెళ్లిన ఎన్డీఆర్ఎఫ్ సభ్యులు

- ప్రకృతి వైపరీత్యాల్లో వీరి సేవలు అభినందనీయం
- భద్రాద్రిలో ఎన్డీఆర్ఎఫ్ బృందం సేవలు

భద్రాచలం, జూలై 31: సరిహద్దుల్లో రక్షణ చర్యలతో పాటు అంతర్గత భద్రతపై అనునిత్యం దృష్టి సారించే పారా మిలటరీ బలగాలు విపత్కర పరిస్థితుల్లో, ప్రకృతి వైపరీత్యాల్లో బాధితులకు విశేషమైన సేవలందిస్తున్నాయి. భూకంపాలు, వరదలు, కొండ చరియలు విరిగిపడటం, రసాయన ఉపద్రవాలలో చి క్కుకున్న వారిని రక్షించడంలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్డీఆర్ఎఫ్) అందిస్తున్న సేవలు శ్లాఘనీయం. గత 19 ఏళ్లుగా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పారామిలటరీ బలగాలకు చెందిన సిబ్బంది ఎన్డీఆర్ఎఫ్ ద్వారా విశేషంగా సేవలందించడం జరుగుతోంది.

ఇటీవల భద్రాద్రి జిల్లాలో ఎగువ భాగాన కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపి పెరుగుతోంది. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఎన్డీఆర్ఎఫ్ సేవలను జిల్లాలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ముందస్తుగా అందించేందుకు సంబంధిత ఉన్నతాధికారులను కోరారు. ఈ నేపథ్యంలో ఏపీలోని కృష్ణా జిల్లా కొండపడలూరుకు చెందిన పదో ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్‌కు చెంది న 34 మంది సభ్యుల బృందం ఇన్‌స్పెక్టర్ భూపేంద్ర కుమార్ నేతృత్వంలో వారం రోజుల క్రితం భద్రాచలం చేరుకొని అత్యవసర సమయంలో సేవలందించేందుకు సిద్ధంగా ఉంది.

గుజరాత్‌లో ఊహించని భూకంపం, వరదలు, అలాగే ఇతర రాష్ట్రాల్లో అనూహ్యంగా ప్రకృతి వైపరీత్యాలు వరుసగా చోటు చేసుకుంటుండటంతో కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాల్లో సేవలందించేందుకు ఒక ప్రత్యేక విభాగం అవసరమని గుర్తించింది. ఈ క్రమంలో డిజాస్టర్స్ మేనేజ్‌మెంట్ చట్టాన్ని 2005లో రూపొందించారు. 2006లో నేషనల్ డిజాస్టర్స్ మేనేజ్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసి అందులో ఎన్డీఆర్ఎఫ్‌ను కీలకంగా చేశారు. ఎన్డీఆర్ఎఫ్‌లో ఏప బలగాలుంటాయంటేనేషనల్ డిజాస్టర్స్ రెస్పాన్స్ ఫోర్స్‌లో (ఎన్డీఆర్ఎఫ్)లో దేశంలోని పారా మిలటరీ బలగాలకు చెందిన సిబ్బంది సేవలను వినియోగించుకోవడం జరుగుతోంది.

సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఎస్ఎస్‌బి, ఐటీబీఎఫ్, సీఐఎస్ఎఫ్‌లలో పని చేసే సిబ్బంది తప్పనిసరిగా ఎన్డీఆర్ఎఫ్‌లో కనీసం ఏడేళ్ల కాలం సేవలందించాల్సి ఉంటుంది. ఇందు కోసం వారికి ప్రత్యేక శిక్షణను ఇస్తారు. వరదల్లో కాని, అగ్ని ప్రమాదాల్లో కాని, భూకంపాలు చోటు చేసుకున్నా ఇలా వివిధ సమయాల్లో ఏ విధంగా వ్యవహరించాలి ప్రాణపాయ స్థితిలో ఉన్న వారిని ఏ విధంగా రక్షించాలి అనే అంశాలను సైతం వారికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వడంతో ఎన్డీఆర్ఎఫ్‌లోని ప్రతి ఒక్కరూ సుశిక్షితులైన సిబ్బంది ఉండటం విశేషం.

### దశాబ్దకాలంగా భద్రాద్రిలో సేవలు

ప్రతి ఏటా వరదల సీజన్‌లో మూడు నెలల పాటు భద్రాద్రిలోనే ఎన్డీఆర్ఎఫ్ బృందం ఇక్కడే ఉండి వరద బాధితులకు సేవలందిస్తుంటారు. గత దశాబ్దకాలంగా పదో బెటాలియన్‌కు చెందిన వారు విపత్కర పరిస్థితు ల్లో గర్భిణులు, ఇతరత్రా ఇబ్బందులతో బాధపడుతున్న వారిని గుర్తించి వారిని ఆదుకుంటున్నారు. కాగా 2022లో వచ్చిన మహోగ్ర గోదావరి సమయంలో భద్రాచలానికి సమీపంలో ఉన్న అల్లూరి జిల్లా యటపాక మండలం గుండాలలో వరద బాధితులను ఆదుకోవడంలో ఎన్డీఆర్ఎఫ్ సేవలు మరువలేనివి. 2023లో ములుగులో సైతం ఎన్డీఆర్ఎఫ్ బృందం ఆ పదలో ఉన్న వారిని ఆదుకుంది.

### గతంలో గుంటూరు.. ప్రస్తుతం కృష్ణా నుంచి

ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్‌ను ఏపీలోని గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో 2011లో ఏర్పాటు చేశారు. అనంతరం కృష్ణా జిల్లా కొండపడలూరుకు పదో ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్‌కు మార్చడం జరిగింది. గతంలో ఉమ్మడి రాష్ట్రంతో పాటు కర్ణాటక రాష్ట్రంలో ఏ విధమైన ఉపద్రవాలు వచ్చినా వీరు సేవలందిస్తున్నారు. దేశంలో మొత్తం 12 బెటాలియన్‌లుండగా గుంటూరులో ఒక బెటాలియన్ ఉంది. ఎన్డీఆర్ఎఫ్‌లోని ఒక బెటాలియన్‌లో 1,147 మంది సిబ్బంది ఉంటారు. ఇందులో ఆరు కంపెనీలు కలిపి ఒక బె టాలియన్‌గా పేర్కొంటారు. ఒక కంపెనీలో 166 మంది ఉంటారు. మూడు బృందా లు కలిపి ఒక కంపెనీగా పేర్కొంటారు. ఒక బృందంలో 47 మంది సిబ్బంది ఉండటం జరుగుతోంది. వీరికి కమాండెంట్, సెకండ్ కమాండెంట్, డిప్యూటీ కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్, టీం కమాండర్‌లు నేతృత్వం వహిస్తారు.

ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది విపత్కర పరిస్థితుల్లో సేవలందించడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని స్టేట్ డిజాస్టర్స్ రెస్పాన్స్ ఫోర్స్‌కు శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. అలాగే కమ్యూనిటీ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో భాగంగా (సీఏపీ) ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

## పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత: సీపీ


విశాంత్రి గదులను ప్రారంభిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, జూలై31: పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. నగరంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ సిబ్బంది విశ్రాంతి తీసుకోవడానికి నిర్మించిన వసతి గదులను సిబ్బందితో కలిసి సీపీ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు వచ్చే సమయంలో సిబ్బంది విశ్రాంతి గదులు లేక ఇబ్బంది పడుతున్నారని తన దృష్టికి రావడంతో గదులను నిర్మించడం జరుగుతుందన్నారు. 24గంటలు విధులు నిర్వహించే సిబ్బందికి విశ్రాంతి ఎంతో అవసరమని, దానికి అనుగుణంగా బెడ్లు తోకూడిన విశ్రాంతి గదులను నిర్మించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో సిబ్బందిక అవసరమైన మౌలిక సదుపాయాలు, సౌకర్యాల కల్పనకు మరిన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఏడీసీపీ విజయ్‌బాబు, ఏసీపీలు సుశీల్‌సింగ్, నరసయ్య ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, అప్పలనాయుడు, సురేష్, నాగేశ్వరరావు, సాంబశివరావు, నాగుల్‌మీరా, పాల్గొన్నారు.

## పంటల నమోదు త్వరగా పూర్తి చేయండి

- జిల్లా వ్యవసాయ అధికారి ఎం. విజయనిర్మల


చింతపల్లిలో మాట్లాడుతున్న డీఏవో విజయనిర్మల

ఖమ్మం జూలై31: పంట నమోదు ప్రక్రియను వ్యవసాయ విస్తరణ అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం. విజయనిర్మల అన్నారు. క్రాప్ బుకింగ్ ప్రక్రియలో భాగంగా ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమల్ల రెవెన్యూ గ్రామంలో రైతుల పంట పొలాలను బుధ వారం సందర్శించారు. జిల్లాలలో వ్యవసాయ అధికారులు రుణమాఫీకి సంబంధించిన రైతులకు అనుమానాలు నివృత్తి చేయాలని, రైతులకు వినూత్న పద్ధతులపై అవగాహన కల్పించాలని సూచించారు. కొత్త పాస్‌పుస్తకం వచ్చిన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ వ్యవసాయ అధికారి బి. కిషోర్, దంసలాపురం ఏఈవీ అనుషారాణి పాల్గొన్నారు.

### రుణమాఫీ అయిన వారు మళ్లీ రుణాలు తీసుకోండి

ఖమ్మం రూరల్: రుణమాఫీ అయిన రైతులు బ్యాంక్‌కి వెళ్లి మళ్లీ రుణాలు తీసుకోవాలని అప్పుడే రుణమాఫీకి అర్థం ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అన్నారు. మండల పరిధిలోని చింతపల్లి గ్రామంలో రుణమాఫీ అయిన రైతుల అభిప్రాయాలను బుధవారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ మిగిలిన రుణమాఫీ త్వరలోనే జరుగుతుందని వివరించారు. రుణాలు మాఫీ కాని రైతులు రైతు వేదికలకు వెళ్లి ఆధార్‌కార్డు ద్వారా ఏ కారణం వల్ల రుణమాఫీ కావడం లేదని తెలుసుకోవాలని సూచించారు. వివిధ కారణాల వల్ల రుణమాఫీ కానివారికి కూడా, రానున్న రోజుల్లో వారికి కూడా రుణమాఫీ అ య్యే విధంగా కృషి చేస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగేశ్వరరావు, ఏఈవో ఆదర్శ్ పాల్గొన్నారు.

## చిన్ననాటి నుంచే లక్ష్యాన్ని ఎంచుకోవాలి: డీఎంవో


రికార్డులను పరిశీలిస్తున్న డీఎంవో అలీమ్

ఏన్కూరు, జూలై31: చిన్ననాటి నుంచే లక్ష్యాన్ని ఎంచుకోవాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ అలీమ్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏన్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం కూరాకుల సైదయ్య, ఏఎంసీ సెక్రటరీ నామాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ చెప్పిన మాట నిలబెట్టుకుంటుంది

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని


సమావేశంలో మాట్లాడుతున్న నందిని

ముదిగొండ, జూలై 31: కాంగ్రెస్ పార్టీ చెప్పిందే చేస్తుంది.. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని అన్నారు. బుధవారం ముదిగొండలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు రుణమాఫీ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో మల్లు నందిని, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ర్యాలీలో మహిళలతో కలిసి ఆడిపాడారు. ప్రభుత్వం చేసిన రుణమాఫీని హర్షిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, సొసైటీ చైర్మన్ సామినేని వెంకటయ్య, నాయకులు మందరపు నాగేశ్వరరావు, మల్లెల అజయ్, దమ్మాలపాటి సరస్వతీ, వీరబాబు, ఉసికల రమేష్, ధర్మా, రవీందర్‌రెడ్డి, అజ్గర్, బుచ్చాల అన్వేష్, పల్లపాటి కృష్ణ, బచ్చలకూర నాగరాజు, అంజిని తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రులు అనుమతి తీసుకోవాలి

- డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్


కొత్తగూడెంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 31: జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు, రక్త పరీక్షా కేంద్రాలు తప్పకుండా వైద్య ఆరోగ్య శాఖ అనుమతులు పొందాలని డీఎంహెచ్‌వో ఎల్. భాస్కర్‌నాయక్ తెలిపారు. బుధవారం పట్టణంలో పలు ప్రైవేట్ ఆసుపత్రిలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఆసుపత్రిని నిర్వహిస్తున్నట్లు నిర్ధారించి సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఆయుష్ అల్లోపతి, యునానీ, ఫిజియోథెరిపీ అన్ని రకాల ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో డాక్టర్ మాధురి, డిప్యూటీ డెమో ఫైయిజ్ మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గుట్టలు దిగిన మట్టి మాఫియా

- మట్టి దందాపై మంత్రులు ఆరా



మట్టి తొలకాలు నిలుపుదల చేసిన యంత్రాలు

రఘునాథపాలెం, జూలై 31: రఘునాథపాలెం మండలంలో మట్టి మాఫియా మట్టి గుట్టల నుంచి కిందకు దిగింది. భారీ యంత్రాలు, వాహనాలు సైతం ముళ్ల పొదల్లోకి చేరాయి. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'జోరుగా మట్టి దందా' కథనం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మట్టి దందా తీరుపై రాష్ట్ర మంత్రులు సైతం ఆరా తీసినట్లు సమాచారం.

మట్టి తరలించే ప్రాంతాల నుంచి భారీ యంత్రాలను ఇతర ప్రాంతాలకు తరలించారు.

### పేలుడు పదార్థాల గోడౌన్
## అనుమతిని రద్దు చేయాలని వినతి

ఖమ్మం రూరల్, జూలై 31: మండల పరిధిలోని నాయుడుపేటలో ఇండ్ల మధ్యలో నిర్మిస్తున్న పేలుడు పదార్థాల గోడౌన్‌కు అనుమతులను వెంటనే రద్దు చేయాలని కోరుతూ నాయుడుపేట, నడిమితండా గ్రామస్థులు కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. నివాసాల మధ్యలో పేలుడు పదార్థాల గోడౌన్ ఏర్పాటు చేసుకునేందుకు అధికారుల అనుమతితో గిడ్డంగి నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కోన్నారు. ఇండ్ల మధ్యలో పేలుడు పదార్థాలను నిల్వచేస్తే తాము ఎలా నివాసం ఉండాలని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన మధ్య ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నివాసం ఉండాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోడౌన్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

## భద్రాద్రి జిల్లాలో ఎక్సైజ్ దాడులు

- 11,962 కేజీల బెల్లం, 150 కేజీల స్పటిక స్వాధీనం

చుంచుపల్లి, జూలై31: భద్రాద్రి జిల్లాలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 11,962 కేజీల బెల్లం, 150 కేజీల స్పటికను స్వాధీనం చేసుకున్నట్లు కొత్తగూడెం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.జానయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ యంత్రాంగం నాటు సారా కట్టడికి నిత్యం దాడులు నిర్వహిస్తూ, ఎక్కడికక్కడ సారా బట్టీలను ధ్వంసం చేస్తున్నట్లు తెలిపారు. నాటు సారా తయారీలపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. పక్కా సమాచారం మేరకు కొత్తగూడెం నుంచి టేకులపల్లికి బెల్లం లారీలో రవాణా అవుతుండగా ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు వద్ద పట్టుకొని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

## పాముకాటుతో మహిళ మృతి


అమృతమ్మ(ఫైల్)

టేకులపల్లి, జూలై 31: పాముకాటుకు గురై ఓ మహిళ మృతి చెందిన ఘటన బుధవారం భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలంలోని సంపత్‌నగర్‌లో జరిగింది. సంపత్‌నగర్ గ్రామానికి చెందిన మల్లికంటి అమృతమ్మ(51) మంగళవారం రాత్రి 9గంటల సమయంలో తన నివాసమైన రేకుల ఇంట్లో మంచంపై పడుకొని సెల్‌ఫోన్ చూస్తుండగా ఓ పాము ఎడమ మోచేతిపై కాటు వేసింది. పక్కనే ఉన్న ఆమె భర్త, కుటుంబ సభ్యులు వెంటనే కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఆమె మృతదేహానికి బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బోడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అమృతమ్మకు భర్త మల్లికంటి వెంకన్న, వివాహితులైన ముగ్గురు కూతురులున్నారు.

### వేర్వేరు ప్రమాదాల్లో
## ముగ్గురికి గాయాలు

సత్తుపల్లిరూరల్, జూలై31: జగ్గయ్యపేట నుంచి రాజమండ్రికి సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ కిష్టారం వై-జంక్షన్ వద్ద ఎదురుగా వెళ్తున్న లారీని తప్పించబోయి ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించారు.

జూలూరుపాడు, జూలై 31: మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన మహంకాళి రోహిత్, పెండ్యాల వర్ధన్‌లు కలిసి ద్విచక్రవాహనంపై జూలూరుపాడు నుంచి కొత్తగూడెం వైపు వెళ్తుండగా, కొత్తగూడెం నుంచి జూలూరుపాడు వైపు వస్తున్న కారు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు.

## కూలిన పెంకుటిల్లు

- మహిళకు స్వల్ప గాయాలు

కల్లూరు, జూలై 31: పెంకుటిల్లు కూలి ఓ మహిళకు గాయాలైన సంఘటన మండలంలోని నారాయణపురంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మారం పద్మ ఒక్కతే ఇంట్లో ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలకు పెంకుటిల్లు గోడలకు తేమ వచ్చి మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఇళ్లు స్వల్పంగా కూలిన శబ్దం రావడంతో నిద్రలో ఉన్న ఆ మహిళ తేరుకుంది. తప్పించుకునే క్రమంలో ఇటుక పెడ్డలు మీద పడగా స్వల్ప గాయాలయ్యాయి.

## కళాశాలకు వెళ్లలేక..

భద్రాచలం, జూలై 31: ఇంటర్ బైపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని చేయి, గొంతు కోసుకున్న సంఘటన భద్రాచలంలోని ఓ ప్రభుత్వ గురుకులంలో చోటు చేసుకుంది. గురువారం తల్లి కళాశాలకు వచ్చి కుమార్తెతో మాట్లాడి వెళ్లిన అనంతరం ఆ విద్యార్థిని చేయి కోసుకున్నట్లు తెలుస్తోంది.

ఈ విషయమై తోటి విద్యార్థినులు అధ్యాపకులకు చెప్పడంతో చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యార్థినికి స్వల్పగాయమే కావడంతో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు పేర్కొన్నారు. కళాశాలలో ఉండలేక విద్యార్థిని చేయి కోసుకున్నట్లు సమాచారం.

# అంగన్‌వాడీ టీచర్‌పై హత్యాయత్నం

- ఘాతుకానికి పాల్పడిన సొంత మరిది కుమారుడు
- ఖమ్మం జిల్లా దెందుకూరులో ఘటన


అంగన్‌వాడీ టీచర్‌ను పరామర్శిస్తున్న సీడీపీవో శారదశాంతి

మధిరరూరల్, జూలై 31: ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకూరు గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న గుర్రం అరుణపై ఆమె పనిచేస్తున్న అంగన్‌వాడీ సెంటర్‌లోనే బుధవారం ఉదయం హత్యాయత్నం జరిగింది. అరుణ సొంత మరిది కుమారుడైన గుర్రం సాయికుమార్ ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించి పరారయ్యాడు. దీంతో స్థానికులు అరుణను మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో గుర్రం వెంకటరావు సతీమణి అయిన అరుణ దెందుకూరు వన్ అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. ఉదయం 8-30గంటలకు రోజు మాదిరిగానే విధులకు హాజరైంది. అయితే ఆమె సొంత మరిది కుమారుడైన గుర్రం సాయికుమార్ పెట్రోల్‌ను ప్యాకెట్లలో తీసుకువచ్చి అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న ఆమెపై పోసి అగ్గిపుల్లతో నిప్పంటించాడు. దీంతో మంటలు అంటుకొని ఆమెకు మెడ కిందిభాగం, వెనుక, కుడిచేతిపై గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే ఆమెను మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్తి తగాదాలే ఈ ఘటనకు కారణమని భావిస్తున్నారు. గుర్రం అరుణ కుటుంబానికి మరిది కుమారుడైన సాయి కుటుంబానికి ఇప్పటి వరకు ఎటువంటి తగాదాలు, గొడవలు లేవు. అయితే సాయికుమార్ తన తాతతో పొలం విషయమై మంగళవారం గొడవపడినట్లుగా గ్రామస్థులు చెబుతున్నారు. పెద్దనాన్న వెంకటరావుకు అరుణకు పొలాల విషయమై సాయికుటుంబంతో ఎటువంటి వివాదం లేకపోయినా సాయికుమార్ వీరిపట్ల కక్షపెంచుకుని అరుణపై ఈ అఘాయిత్యానికి ఒడిగట్టడం దారుణమని అరుణ తరుపు బంధువుల ఆరోపిస్తున్నారు. దాడిచేసే సమయంలో "మీ భర్త వల్లనే నా పొలం నాశనమైంది" అంటూ కేకలు వేస్తూ పెట్రోల్ పోసి నిప్పంటించాడని బాధితురాలు పోలీసులకు వివరించింది. మెరుగైన చికిత్స కోసం ఆమెను మధిర నుంచి ఖమ్మంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. స్థానికంగా జరిగిన ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అరుణను ఐసీడీఎస్ సీడీపీవో శారదశాంతి పరామర్శించారు. మధిర సీఐ డి. మధు మధిర ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.

## భూ సమస్యను పరిష్కరించాలని రైతుల ఆందోళన

-తహసీల్దార్ హామీతో విరమణ


బాధిత రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

బోనకల్, జూలై 31: తమ భూమికి సంబంధించిన రికార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం బాధిత రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. కార్యాలయంలో ఇద్దరు రైతులు టెంటు వేసి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు టెంట్ వేసి ఆందోళన చేపట్టకూడదని, రైతులకు నచ్చజెప్పడంతో పాటు సమస్యను తహసీల్దార్ పున్నం చందర్ దృష్టికి తీసుకెళ్లారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన ఎర్రగాని కృష్ణయ్యకు వారసత్వంగా నారాయణపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 236/ఆ/2లో 1.05 ఎకరాలు, మరో సర్వే నెంబర్‌లో 0.04 ఎకరాల భూమి ఉంది. ఇట్టి భూమికి సంబంధించి పాస్ పుస్తకం ఉండటంతో రుణమాఫీ వచ్చింది. తిరిగి కొత్త రుణం తీసుకునేందుకు గానూ వన్‌బీ తీసుకునేందుకు మీ సేవా కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఆన్‌లైన్ డిలీట్ అని చూపిస్తుండటంతో వెంటనే రెవెన్యూ అధికారులను ఆశ్రయించాడు. అదే గ్రామానికి చెందిన మరో రైతు ఎర్రగాని కొండలు కూడా ఇదేవిధంగా రావడంతో ఇద్దరు రైతులు కలిసి తమ సమస్యను పరిష్కరించాలని పది రోజులుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు ఆందోళనకు దిగడంతో రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ చెప్పడంతో బాధిత రైతులు ఆందోళన విరమించారు.

## పోక్సో కేసులో ముగ్గురికి జైలు

మణుగూరుటౌన్, జూలై 31: మణుగూరు పట్టణానికి చెందిన ముగ్గురు యువకులకు పోక్సో, అత్యాచారం, దివ్యాంగ చట్టాల కింద నేరం చేసినట్లు రుజువుకావడంతో వారికి జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ కొత్తగూడెం జిల్లా ప్రధాన సెషన్స్ కోర్టు వసంత్‌పాటిల్ బుధవారం తీర్పునిచ్చారు. కేసు వివరాల ప్రకారం.. 2019 సంవత్సరంలో మణుగూరు పట్టణంలోని మైనర్ బాలికను ముగ్గురు యువకులు దేగల యశ్వంత్, నిట్టా ప్రశాంత్, సిద్ది నరేష్‌లు మాయమాటలు చెప్పి పాత పీకేఓసీ-1 ప్రాంతానికి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నాటి ఎస్‌డీపీవో మణుగూరు ఏఎస్‌పీ డాక్టర్ శబరీష్ కేసు నమోదు చేసి ముద్దాయిలను అరెస్ట్ చేశారు. వారిని రిమాండ్‌కు తరలించి విచారణ పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును పరిశీలించిన జిల్లా జడ్జి ముగ్గురు యువకులపై నేరం రుజువుకావడంతో జీవిత ఖైదుతోపాటు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆర్. విజయ్ కుమర్, పీవీడీ లక్ష్మీ, లైజన్ ఆఫీసర్లుగా ఎస్‌కే. ఘని, సీడీవోగా ఎం. అశోక్‌లు వ్యవహరించారు.

## విద్యుదాఘాతంతో పామాయిల్ కూలీ..

- పామాయిల్ గెలలు నరుకుతుండగా ప్రమాదం
- దమ్మపేటలో ఘటన


సూరిబాబు మృతదేహం

దమ్మపేట, జూలై 31: విద్యుదాఘాతంతో పామాయిల్ కూలీ మృతి చెందిన ఘటన బుధవారం దమ్మపేటలో జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం గ్రామానికి చెందిన చిట్టేటి సూరిబాబు(35) భార్యతో కలిసి గతకొంత కాలంగా దమ్మపేటలో కూలీపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం స్థానికంగా ఒక పామాయిల్ తోటలో గెలలు నరికే పనికి వెళ్లాడు. పొడవాటి ఇనుపపైప్‌తో పామాయిల్ గెలలు కోస్తుండగా ప్రమాదవశాత్తు అది జారిపోయి పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడడంతో విద్యుదాఘాతానికి గురై సూరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు. బాధితులు ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామన్నారు.

## టేకులపల్లి మండలంలో వ్యక్తి..

- మరో ఇద్దరికి గాయాలు..

టేకులపల్లి, జూలై 31: విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి, ఏడేళ్ల బాలుడికి గాయాలైన ఘటన మండలంలోని బిల్లుడుతండాలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని ఓ బడ్డీకొట్టు సమీపంలో విద్యుత్ స్తంభాలపై నుంచి విద్యుత్‌వైరు తెగి కిందపడి పోయింది. దుకాణం సమీపంలో తెగిన విద్యుత్ వైరు భూక్యా శ్రీను(33), తేజావతు మోతీలాల్, ఏడేళ్ల బాలుడు నిహాన్(చిన్ను)పై పడింది. గ్రామస్థులు వెంటనే కర్రలతో విద్యుత్ వైరును వారిపై నుంచి తొలగించారు. స్థానికులు క్షతగాత్రులను కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా, భూక్యా శ్రీను మార్గమధ్యలో మృతి చెందాడు. మోతీలాల్, బాలుడు నిహాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు.

## చికిత్స పొందుతూ బాలుడు..

చింతకాని, జూలై 31: చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గాంధీనగర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన బాలుడు (16) ఇద్దరు మిత్రులతో కలిసి ద్విచక్ర వాహనంపై మంగళవారం ఖమ్మం వెళ్లారు. రాత్రి సమయంలో ఇంటికి తిరిగి వస్తుండగా, పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో వారి ద్విచక్ర వాహనాన్ని ఓ ట్రాక్టర్ ఢీకొంది. ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు వెంటనే సమీప ఆస్పత్రికి తరలించారు. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సదరు బాలుడు బుధవారం మృతి చెందాడు. బాలుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రెండేళ్లలో నాల్గోసారి

- ఆహార తనిఖీ కార్యాలయానికి కష్టాలు
- సమీకృత కలెక్టరేట్ నుంచి కేఎంసీలోకి మార్చేందుకు ఏర్పాట్లు



తరలింపు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 31: ఉమ్మడి ఖమ్మం జిల్లా గెజిటెడ్ ఆహార తనిఖీ శాఖ కార్యాలయానికి సొంత గూడు కష్టాలు తీరడం లేదు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి రాని ఇక్కట్లు ఆహార తనిఖీశాఖకే తగులుతున్నాయి. నిబంధనల మేరకు అన్ని ప్రభుత్వశాఖల వలే ఆహార తనిఖీ శాఖకు ఇతర శాఖలతో సంబంధం లేకుండా ప్రభుత్వ కార్యాలయం ఉండాలి. దశాబ్దాలుగా ఇతే రీతిలో ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెంలో ప్రత్యేకంగా అద్దె భవనంలో శాఖ నిర్వాహణ జరిగింది. అయితే రెండేళ్ల క్రితం స్వతంత్రంగా ఉన్న శాఖను ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలోకి తరలించారు. తర్వాత ఏడాది క్రితం తిరిగి సమీకృత కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. తిరిగి ఇప్పుడు మరోసారి సమీకృత కలెక్టర్ కార్యాలయం నుంచి ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయానికి తరలించాలని ఆదేశాలు రావడంతో బుధవారం అధికారులు కార్యాలయం తరలింపు ఏర్పాట్లు ప్రారంభించారు. ఇలా రెండేళ్లలో నాల్గోసారి తిప్పడంపై అనేక విమర్శలు వెలువడుతున్నాయి.

## విషపు నీరు తాగి 20 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

పెనుబల్లి, జూలై 31: రసాయనాలు కలిసిన నీరు తాగి 20 గొర్రెలు మృతి చెందిన సంఘటన మండలంలోని లంకాసాగర్ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామచంద్రరావుబంజర్ గ్రామానికి చెందిన బోలే రాంబాబుకు చెందిన 200గొర్రెలను లంకాసాగర్ క్రాస్‌రోడ్డులోని మామిడితోటలో మేపుతుండగా, సింగరేణి బొగ్గు బ్లాస్టింగ్‌కు ఉపయోగించే కెమికల్స్‌ను లారీల్లో తీసుకువచ్చి క్రాస్‌రోడ్డు వద్ద వదలడంతో అక్కడి నీరు కలుషితమై 20గొర్రెలు మృతి చెందాయని బాధితుడు రాంబాబు వాపోయారు. నీరు తాగిన గొర్రెలకు వెటర్నరీ అసిస్టెంట్ రామకృష్ణ సిబ్బంది వైద్య సేవలందించగా 20గొర్రెలు మృతి చెందాయి. చనిపోయిన గొర్రెల విలువ సుమారు రూ.2 లక్షలకు పైగానే ఉంటుందని బాధితుడు తెలిపాడు. నష్టపోయిన బాధితుడికి ప్రభుత్వం నష్ట పరిహారం అందజేయాలని గొర్రెల, మేకల పెంపకందార్ల జిల్లా నాయకుడు తిరుపతిరావు కోరారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

ఖమ్మం
ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి
8
గురువారం 1 ఆగస్టు 2024

## అర్జీలు పెండింగ్ లేకుండా చూడాలి

● టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 31: అర్జీలు పెండింగులో లేకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ అన్నారు. బుధవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సీఎం ప్రజాపాలన, కలెక్టర్ గ్రీవెన్స్ డే పెండింగ్ అర్జీలు, ఆర్టీఐ, కోర్ట్ కేసుల పై కలెక్టరేట్ నుంచి సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, అధికారులు ప్రజల నుంచి వచ్చే అర్జీల విషయమై పరిష్కార చర్యలు త్వరితగతిన చేపట్టాలన్నారు. సీఎం ప్రజాపాలన, కలెక్టర్ గ్రీవెన్స్ డే కు సంబంధించి అర్జీల పరిష్కారం, పెండింగ్ అర్జీల సమగ్ర నివేదికలను శనివారం వరకు సమర్పించాలన్నారు. ఆర్టీఐ కేసులు, కోర్ట్ కేసుల విషయమై నిర్ణీత కాలంలో చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో మండల తహసీల్దార్ కార్యాలయంలో చేపట్టే ప్రజావాణి కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

# జిల్లాలో ఉద్యోగుల బదిలీలు

● పంచాయతీరాజ్ ఖమ్మం డీఈగా మహేష్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 31: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో డీఈల బదిలీలు జరిగాయి. బుధవారం నలుగురు డీఈలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఖమ్మం హెడ్‌క్వార్టర్ డీఈగామహేష్‌కు బదిలీ అయ్యింది. ప్రస్తుతం ఆయన తిరుమలాయపాలెంలో పనిచేస్తూ ఖమ్మం డీఈగా ఇన్‌చార్జ్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను ఇక్కడే పూర్తిస్థాయి డీఈగా బదిలీ చేశారు. వేణుగోపాల్‌ను తిరుమలాయపాలెంకు, కెవీకె శ్రీనివాస్‌ను ముదిగొండకు, వి కోటేశ్వరరావును మధిరకు బదిలీ చే శారు. సత్తుపల్లి ఈఈగా రాంకోటి నాయక్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న చంద్రమౌళి పదవీవిరమణ పొందడంతో ఆ స్థానంలో రాంకోటి నాయక్‌ను నియమించారు.

### ఖమ్మం మార్కెట్ గ్రేడ్-2 సెక్రటరీ బజారు బదిలీ

ఖమ్మం మార్కెట్: నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గ్రేడ్ టూ సెక్రెటరీగా విధులు నిర్వర్తిస్తున్న భూక్యా బజారు బదిలీ అయ్యారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా ఆయనను ఏన్కూరు వ్యవసాయ మార్కెట్‌కు కేటాయించగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు గ్రేడ్ టూ సెక్రెటరీగా వరంగల్ జిల్లా హస్నాబాద్ మార్కెట్‌లో పనిచేస్తున్న సృజన్‌బాబును కేటాయించారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేశారు.

### ఖమ్మంఅర్బన్ ఎంఈవోగా రాములు

ఖమ్మంఖానాపురంహవేలి/సత్తుపల్లిరూరల్ జూలై31: విద్యాశాఖలో సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలోని పలు మండలాల ఎంఈవోలను బదిలీ చేస్తూ రీజనల్‌జాయింట్ డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ వరంగల్ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం అర్బన్, రఘునాధపాలెం మండలాల విద్యాశాఖ అధికారిగా బి.రాములును నియమించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంఈవో శ్రీనివాస్‌ను ఖమమ్మం రూరల్ మండలానికి బదిలీ చేశారు. రాములు సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తూ బదిలీపై ఖమ్మంకు బదిలీ అయ్యారు.

### డిగ్రీ అధ్యాపకుల బదిలీలు

ఖమ్మంఖానాపురంహవేలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల బదిలీలు బుధవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పది కళాశాలల్లో అధ్యాపకులను వివిధ జిల్లాలకు బదిలీ చశారు. ఖమ్మంనగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్, ప్రభుత్వ మహిళ డిగ్రీకళాశాల, నేలకొండపల్లి, సత్తుపల్లి, మధిర కళాశాలల అధ్యాపకులు బదిలీ అయ్యారు. ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో మొత్తం 80మందికిగాను 40మంది, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో 13మందికి 10మంది బదిలీకాగా ఉమ్మడి జిల్లాలోని మిగతా కాలేజీల్లో కూడా బదిలీ అయ్యారు. వీరిస్థానంలో వివిధ జిల్లాలకు చెందిన అధ్యాపకులు రానున్నారు.

### జూనియర్ కళాశాలల అధ్యాపకుల బదిలీలు

ఖమ్మం ఖానాపురంహవేలి : ఖమ్మం జిల్లాలోని 19 జూనియర్ కళాశాలల అధ్యాపకుల బదిలీలు బుధవారం నిర్వహించారని జిల్లా ఇంటర్ అధికారి కె రవిబాబు తెలిపారు. జిల్లాలోని మొత్తం 209 మంది అధ్యాపకుల్లో 57 మంది బదిలీ అయినట్లు తెలిపారు. 14 మంది లైబ్రేరియన్స్, 57 మంది నాన్ టీచింగ్ సిబ్బంది బదిలీ అయినట్లు తెలిపారు.

### పంచాయతీరాజ్ డీఈఈగా వెంకటేశ్వరరావుకు ఉద్యోగోన్నతి

సత్తుపల్లిరూరల్, జూలై 31: పంచాయతీరాజ్ సబ్ డివిజన్ సత్తుపల్లి డీఈఈగా అన్నంనీది వెంకటేశ్వరరావు ఉద్యోగోన్నతి పొందారు. గురువారం ఆయన సత్తుపల్లి నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన సత్తుపల్లిలోనే ఏఈఈగా బాధ్యతలు నిర్వహిస్తుండగా తాజాగా పదోన్నతిపై ఇక్కడే పనిచేయనున్నారు. వెంకటేశ్వరరావును ఈఈ శ్రీరామ కోటి నాయక్, తోటి ఉద్యోగులు అభినందించారు.

## సేవ చేయడంలోనే ఆత్మసంతృప్తి

సత్తుపల్లి, జూలై 31: తాను పనిచేసే పాఠశాలకు సేవ చేయడంతో పాటు విద్యార్థులకు మరిన్ని సేవలు అందించడంలోనే ఆత్మసంతృప్తిని ఇస్తుందని ప్రధానోపాధ్యాయుడు కొండా ప్రభుదాసు అన్నారు. బుధవారం మండలంలోని కిష్టారం మండల పరిషత్ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరానికి గానూ సుమారు రూ.8వేల విలువైన నోట్‌బుక్స్‌ను 55మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీసీ చైర్మన్ నరుకుళ్ల విజయకుమారి, సహోపాధ్యాయులు ఎం.శ్రీలత, కే.అశోక్ చక్రవర్తి పాల్గొన్నారు.

## తల్లాడలో వనమహోత్సవం

తల్లాడ, జూలై 31: తల్లాడలో బుధవారం వనమహోత్స కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణంలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు మొక్కలు నాటారు. లూర్థుమాత ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్క నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు, కార్యదర్శి కటికి వెంకటేశ్వర్లు, కోశాధికారి శీలం వెంకటరెడ్డి, కర్నాటి లక్ష్మారెడ్డి, వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## టీబీ వ్యాధి నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

ఏన్కూరు, జూలై 31: 2025 నాటికి టీబీ వ్యాధి పూర్తిగా నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు టీబీ నోడల్ పర్సన్ శివ రాజ. తెలిపారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల, కళాశాలలో టీబీ వ్యాధి చికిత్సపై అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు ఉన్నట్టయితే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ నివారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ చికిత్స సూపర్‌వైజర్ సురేష్, ల్యాబ్ సూపర్‌వైజర్ ఆర్.సంజీవ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ తూడి శ్రీనివాసరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, హెచ్‌డీ స్వరూపరాణి, కళాశాల స్టాఫ్‌నర్సు శార స్వప్న పాల్గొన్నారు.

## ఇందిరా డెయిరీ నమ్మకం కల్గించండి

ముదిగొండ, జూలై 31: ఇందిరా డెయిరీపై పాలోత్పత్తిదారులకు నమ్మకం కలిగించేలా పనిచేయాలని అడిషనల్ డీఆర్‌డీఏ పీడీ నూరుద్దీన్ అన్నారు. బుధవారం ముదిగొండ స్త్రీశక్తి భవనంలో గ్రామదీపికలు, పాలోత్పత్తి కోఆర్డినేటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాలోత్పత్తిని పెంచేందుకు ఎక్కువ మొత్తంలో సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. ప్రైవేట్ డెయిరీల కంటే ప్రభుత్వం ఏర్పాటుచేసే ఇందిరాడైరీ విధానాలపై పాలోత్పత్తిదారులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. అసిస్టెంట్ డైరెక్టర్ కిషోర్, ఏపీఎం కల్పన, శ్రీనివాసరావు, లక్ష్మణ్‌రావు, సీసీలు అనురాధ, రామారావు, నాగేశ్వరరావు, సైదులు, హరికృష్ణ, రాజేశ్వరి పాల్గొన్నారు.

## విద్యార్థులకు నిఘంటువుల పంపిణీ

కల్లూరు, జూలై 31: కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం తోపుడుబండి ఫౌండేషన్ తరుపున విద్యార్థులకు నిఘంటువులు, డైరీ, చూసి రాత కాపీలు, నోటు బుక్‌లు పంపిణీ చేశారు. సాధిక్అలీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదవటం, రాయటంలో తమ నైపుణ్యాలను పెంపొందించుకునేలా వాటిని అందజేశామన్నారు.ఎంఈఓ దామోదరప్రసాద్, హెచ్ఎంలు నివేదిత పాల్గొన్నారు.

## బీపీ పరీక్ష పరికరాలు వితరణ

కారేపల్లి జూలై 31: మండల పరిధిలోని చీమలపాడు ప్రభుత్వ ప్రాథమిక ఉప కేంద్రానికి అదేగ్రామానికి చెందిన పోతుల వెంకటేశ్వర్లు బుధవారం రెండు బిపి పరిక్ష పరికరాలను అందజేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన కుమారుడు శ్రీధర్ హైదరాబాద్ లోని మారేడుపల్లి ట్రాఫిక్ సబ్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్నారని,శ్రీధర్ సూచన మేరకు సబ్ సెంటర్‌కు అందజేసినట్లు తెలిపారు.

# వ్యవసాయక్షేత్రంలో రైతుల సంబురాలు

» రూ.1.5లక్షల రైతు రుణమాఫీపై సీఎం,వ్యవసాయశాఖ మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

రఘునాథపాలెం, జూలై 31: కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు రైతుల ప్రయోజనాల కోసం పనిచేస్తొందని కాంగ్రెస్ నాయకులు తాతా రఘురాం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ రూ.1.5లక్షలు రైతులు బ్యాంకు ఖాతాలకు జమ కావటంతో బుధవారం రఘునాథపాలెం, చింతగుర్తిలోని పత్తి వ్యవసాయక్షేత్రంలో రైతులు సంబురాలు జరిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ వ్యవసాయం చేసే రైతే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కావటంతో రైతులు ఊహించిన ప్రయోజనాలు అందుతున్నాయన్నారు. భవిష్యత్‌లో అనేక రైతు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల ఇప్పటికే కార్యచరణ చేశారని పేర్కొన్నారు. నాయకులు గుడిపూడి రామారావు, అల్లిక సీతయ్య, నల్లమోతు శ్రీనివాసరావు, రెంటాల ప్రసాద్, నందియా, జగ్గయ్య, మంగ్యా, రామకృష్ణ, ఉపేందర్, గోపయ్య, లాలయ్య, నరేశ్ పాల్గొన్నారు.

### రైతు బాంధవులు సీఎం, మంత్రి

కామేపల్లి: రైతు బాంధవుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అని పింజరమడుగు ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య అన్నారు. బుధవారం స్థానిక తాళ్లగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతు రుణమాఫీకి సంబంధించి ఇచ్చిన మాట నిలబెట్టి రైతులకు లక్షా, లక్షన్నర రుణ మాఫీ చేశారని అన్నారు. మ్మడి జిల్లాలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సబ్ రమిటీలో ఉండి రైతు రుణ మాఫీకి నాంధి పలికారని అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం మరింత అభివృద్ది చెంది దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వస్తుందని అన్నారు.

## సొసైటీలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి తీర్మానం


సమావేశంలో మాట్లాడుతున్న బొర్రా రాజశేఖర్

వైరా, జూలై 31: వైరా సొసైటీకి చెందిన బ్రాహ్మణపల్లి అగ్రహారం రోడ్డులో పోలీస్ స్టేషన్ వెనుకభాగంలో ఉన్న స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు సొసైటీ పాలకవర్గ సమావేశం తీర్మానించింది. డీసీసీబీ డైరెక్టర్ సొసైటీ అధ్యక్షుడైన బొర్రా రాజశేఖర్ అధ్యక్షతన బుధవారం పాలకవర్గ సమావేశం జరిగింది. 1.20ఎకరాల సొసైటీ స్థలం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్నందున బ్రాహ్మణపల్లి రోడ్డు వైపు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు నిర్ణయించారు. అలాగే టీఎస్.ప్రసాద్ షాపింగ్ కాంప్లెక్స్ అయిన మొదటి అంతస్థు నిర్మించటానికి పాలడుగు, గొల్లపూడి గ్రామాల్లో నాబార్డు నిధులతో గోదాములు నిర్మించేందుకు కమిటీ నిర్ణయించింది. ఈ సొసైటీలోని 1261మంది సభ్యులకు రెండు విడతల్లో రూ.4,03,29,993 నిధులను రుణమాఫీ చేసిన తెలంగాణ ప్రభుత్వానికి కమిటీ కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానించింది. ఉపాధ్యక్షుడు కొణిధన కోటేశ్వరరావు, డైరెక్టర్లు యన్నం వెంకటకోటారెడ్డి, తాతా బసవయ్య, తేజావత్ రామకృష్ణ, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, బొల్లెపోగు శ్రీను, పర్సారి స్వరూపరాణి, తడికమళ్ల ధనలక్ష్మీ, వనమా చిన్నసత్యనారాయణ, పసుపులేటి హన్మంతరావు, సీఈవో బొల్లం రామకృష్ణ పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం తనిఖీ

» వైరాలో డీఎస్‌వో, డీఈవో, రఘునాథపాలెంలో మద్య నియంత్రణ అధికారి, నేలకొండపల్లిలో జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మధ్యాహ్న భోజనం పరిశీలన


వైరా గురుకులంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఎస్‌వో

వైరా, జూలై 31:: వైరాలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో బుధవారం జిల్లా పౌరసరఫరాశాఖ అధికారి(డీఎస్‌వో) చందన్‌కుమార్ మధ్యాహ్నభోజనాన్ని తనిఖీ చేశారు. ఈ గురుకులంలోని విద్యార్థులకు సరఫరా చేసిన బియ్యాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి భోజన నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆతర్వాత వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. డిప్యూటీ తహసీల్దార్ రామచందర్‌రావు, గిర్దావర్ కిరణ్, ప్రిన్సిపాల్ బత్తుల రమ పాల్గొన్నారు.


విద్యార్థులతో కలసి భోజన చేస్తున్న డీఈవో

### రెబ్బవరం హైస్కూల్‌ను తనిఖీ చేసిన డీఈవో

మండలంలోని రెబ్బవరం హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ బుధవారం తనిఖీ చేశారు. మధ్యాహ్నభోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల ప్రతిభా పాఠవాలను పరీక్షించారు.. అన్ని తరగతి గదులను తిరిగి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడైన ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### మధ్యాహ్నం భోజనం పరిశీలించిన జిల్లా అధికారులు

ఖమ్మంఖానాపురంహవేలి: కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ ఆదేశాలతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంను తనిఖీచేస్తూ విద్యార్థులతో కలిసి భోజనాలు చేయాలన్న ఆదేశాలను బుధవారం జిల్లాలో జిల్లా అధికారులు తనిఖీ నిర్వహించారు. ఖమ్మం నగరంలోని బల్లేపల్లి ప్రభుత్వ పాఠశాలలో మద్యం నియంత్రణ అధికారి నాగేందర్‌రెడ్డి మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని వివరాలు తెలుసుకున్నారు. జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎంఎ మహమూది నేలకొండపల్లి బాలుర కళాశాలను సదర్శించి విద్యార్థులతో భోజనం చేశారు.


బల్లేపల్లి ప్రభుత్వ పాఠశాలలో..

## ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి శేషగిరిరావు కృషి

● పదవీ విరమణ సన్మాన సభలో విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేందర్


శేషగిరిరావుకు జ్ఞాపికను అందిస్తున్న ఎస్ఈ సురేందర్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 31: విద్యుత్‌శాఖలో 33ఏళ్లుగా ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికై తక్కిళ్లపల్లి శేషగిరిరావు విశేషమైన కృషి చేసి 1104సంఘం రాష్ట్ర అధ్యక్షుని వరకు ఎదిగారని విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేందర్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పదవీ విరమణ పొందిన తక్కిళ్లపల్లి శేషగిరిరావు సన్మాన కార్యక్రమంలో ఎస్ఈ సురేందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఒక వైపు ఉద్యోగుల పక్షాన నిలబడి పోరాటం చేస్తూనే విద్యుత్ సంస్థ అభివృద్ధిలో శాఖకు అండగా నిలిచారని గుర్తు చేశారు. డీఈలు బాబురావు, నాగేశ్వరరావు, కార్యాలయం ఏవో శ్రీధర్, సంఘం నాయకులు సురేశ్, శ్రీధర్, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలి: సీపీఎం

ఖమ్మం రూరల్, జూలై 31: బ్యాంకుల్లో అప్పు ఉన్న ప్రతి ఒక్క రైతు కుటుంబానికి రెండు లక్షల రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బుగ్గవీటి సరళ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వరంగల్‌క్రాస్ రోడ్డులోని తమ్మినేనిసుబ్బయ్య భవన్‌లో సీపీఎం మండల కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీని ఎటువంటి ఆంక్షలు లేకుండా అందరికి వర్తింపచేసి, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నండ్రా ప్రసాద్, పి.సంగయ్య, నందిగామ కృష్ణ, మోహన్‌రావు, సుమతి, నాయకులు నాగేశ్వరరావు, ప్రసాద్, గురవయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు..

## రేషన్‌కార్డులు లేవని పెండింగ్‌లో పెట్టడం సరికాదు

కొణిజర్ల, జూలై 31: రుణమాఫీ జాబితాను ప్రకటించిన ప్రభుత్వం రేషన్‌కార్డులు లేని రైతుల రుణమాఫీని పెండింగ్‌లో పెట్టడం సరికాదని, దాని ద్వారా చాలామంది రైతులు రుణ మాఫి కాక ఆందోళన చెందుతున్నారని, రైతులందరికి రుణమాఫి చేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ, రైతుసంఘం ప్రధానకార్యదర్శి స్వర్ణ సుబ్బారావు, ఆమ్‌ఆద్మీ రాష్ట్ర కోర్‌కమిటి సభ్యులు తిరుమలరావు బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. పట్టాదారు పాస్‌పుస్తకం ఆధారంగా ఐదు ఎకరాలలోపు రైతులందరికి రుణమాఫి వర్తింపచేయాలని కోరారు.

## ఎన్నికల హామీలు అమలు చేయాలి: మాస్‌లైన్

తిరుమలాయపాలెం, జూలై 31: ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలు అమలుచేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకులు తిమ్మిడి హనుమంతరావు అన్నారు. గురువారం మండలలోని బచ్చోడులో ఆపార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారదరికి కొత్తపెన్షన్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలన్నారు. షరతులు లేకుండా రైతుల రూ.2లక్షలు మాఫీచేయాలన్నారు. ఆగస్టు 1న మండల కేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వెన్నబోయని శ్రీను, గొర్రెపాటి శ్రీను, భద్రమ్మ, భిక్షం, తిమ్మిడి రఘుబాబు, సైదులు, నందిపాటి లచ్చయ్య పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం ప్రజావాణి: ఎంపీడీవో

చింతకాని, జూలై 31: ఆగస్టు నెల నుంచి ప్రతి సోమవారం మండలంలో అందరూ మండల అధికారుల ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కూరపాటి అనంతరాజు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను మండల ప్రజావాణిలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను సదరు అధికారి ధృవీకరణతో జిల్లా అధికారులను సంప్రదించాలన్నారు.

## బొజ్జాకు సండ్ర పరామర్శ

సత్తుపల్లి, జూలై 31: మండలంలోని కాకర్లపల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బొజ్జా భాస్కరరావును మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య బుధవారం పరామర్శించారు. ఆయన ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురవ్వగా పట్టణంలోని కస్తూరి రామ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ కూసంపూడి మహేష్, జడ్పీటీసీ సభ్యుడు కూసంపూడి రామారావు, నాయకులు యాగంటి శ్రీను, దొడ్డా శంకరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మరికంటి శ్రీను, బెల్లంకొండ రాము పాల్గొన్నారు.

## లింగన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

కొణిజర్ల, జూలై 31: భూ పోరాటయోధుడు లింగన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని అఖిల భారత రైతుకూలిసంఘం జిల్లా నాయకులు షేక్ ఖాసీం పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రామనర్సయ్యనగర్ గ్రామంలో బుధవారం లింగన్న వర్థంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అంగోతు భాష, పఠాన్‌ఖాసీంఖాన్, నాగేశ్వరరావు, శంకర్, సీతయ్య దసురు, ఎర్రమత్య, నాగులు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మధిర అభివృద్ధికి భట్టి నిరంతర కృషి

» అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని » వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ


ట్రైసైకిల్ అందజేస్తున్న మల్లు నందిని

ఎర్రుపాలెం జూలై 31: మండల కేంద్రంలోని శుభమస్తు కల్యాణమండపంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని వికలాంగులకు ట్రై సైకిల్లు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామానికి ఒక్కటి చొప్పున 30 మంది వికలాంగులకు ట్రై సైకిల్లను వితరణ చేశారు. ఆమె మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలో అమ్మ ఫౌండేషన్ ద్వారా పలు సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా అన్ని మండలాల్లో ఫౌండేషన్ వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. మధిర నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిరంతర కృషి చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు అధైర్యపడొద్దని, మధిర అభివృద్ధి భట్టి గుండె చప్పుడని, అభివృద్ధి ఆగితే గుండె ఆగినట్లేనని భావోద్వేగమయ్యారు. అనంతరం కార్యకర్తల సంక్షేమం కోసం, కాంగ్రెస్‌పార్టీ పునర్వైభవం కోసం తపన పడుతుంటారని అన్నారు. భట్టి అందుబాటులో లేకున్నా తాను కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. వారంలో ఒకరోజు నియోజకవర్గంలో ప్రతి మండలానికి కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బండారు నర్సింహారావు, పీసీసీ సభ్యుడు శీలం ప్రతాప్ ఎరెడ్డి, జిల్లా యువజన నాయకులు వేజండ్ల సాయికుమార్, కడియం శ్రీనివాసరావు, మల్లెల లక్ష్మణ్‌రావు, అనుమోలు కృష్ణారావు, ఇస్మాయిల్, నాగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి , రాజీవ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల భద్రత కూడా ముఖ్యం: మునిసిపల్ చైర్‌పర్సన్

మధిరటౌన్, జూలై 31: మునిసిపాలిటీ లో పనిచేసే కార్మికుల ఆరోగ్యంతో పాటు వారి భద్రత కూడా చాలా ముఖ్యమని మధిర మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత అన్నారు. బుధవారం మధిర లోని మునిసిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు ఆమె వాప్రాన్‌లతో పాటు హెల్మెట్ లను పంపిణీ చేశారు. మునిసిపాలిటీలో పనిచేసే కార్మికులతో పాటు ఉద్యోగులు అందరకీ ఇటీవల వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి మందులను కూడా అందజేశామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ శీలం విద్యాలత, కమిషనర్ షఫీ ఉల్లా, మేనేజర్ రవీంద్ర, కౌన్సిలర్ మునుగోటి వెంకటేశ్వరావు నాయకులు రంగిశెట్టి కోటేశ్వరరావు, గద్దల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## క్యాబ్ డ్రైవర్స్ సంఘం నూతన కమిటీ నియామకం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 31: ఐఎన్‌టీయూసీ తెలంగాణ క్యాబ్స్ డ్రైవర్స్ సంఘం నూతన కమిటీని బుధవారం ఖమ్మంలో నియామకం చేశారు. నూతన కమిటీ సభ్యులకు కాంగ్రెస్ నాయకులు తుంబూరి దయాకర్‌రెడ్డి నియామక పత్రాలను అందించారు. జిల్లా అధ్యక్షుడిగా విజయవర్మ, కార్యదర్శిగా జీవన్‌సాగర్, కార్యవర్గ సభ్యులుగా పాపారావు, డీ శ్రీనివాస్, ఎంసా యి కృష్ణ, మధు, రసూల్, సత్తిబాబు, దస్తగిరి కార్యవర్గాన్ని నియామకం చేశారు.

## ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై31: ఎస్సీ వర్గీకరణఖు చట్టబద్దత కలిపించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ కోరారు. బుధవారం ఖమ్మం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కలిపించాలని 30 ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్న మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలన్నారు. ఏబీసీడీ వర్గీకరణ కోసం అలెపెరగని పోరాటాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ఈవర్షాకాలం పార్లమెంట్ సమావేశాల్లో తక్షణమే వర్గీకరణ బిల్లును ఆమోదించాలని కోరారు. ఎస్సీవర్గీకరణ కోరుతూ ఈనెల 6,7తేదీల్లో ఢిల్లీలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

## ప్రజా అసరాలను గుర్తించి మౌలిక వసతులు కల్పిస్తాం

● పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీరామ కోటి

సత్తుపల్లి, జులై31: సత్తుపల్లి పరిధిలోని ప్రజా అవసరాలను గుర్తించి మౌలిక వసతులు కల్పించేందుకు నిత్యం కృషి చేస్తామని సత్తుపల్లి పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ శ్రీరామ కోటి నాయక్ అన్నారు. బుధవారం సత్తుపల్లిలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ రహదారులు, భవనాల నిర్మాణంలో ప్రజాప్రతినిధులు, ప్రజల సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. రోడ్లు, పేవ్‌మెంట్లు, వంతెనలు, డ్రైనేజీ వ్యవస్థలు, పార్కులు, పైపులు, నీటి నిర్వహణ, సరఫరా, వీధిలైట్లు తదితర అవసరాలను గుర్తిస్తామని, మరమ్మత్తులతో పాటు నూతన నిర్మాణాలపై ప్రణాళికలు రూపొందించి ఆచరణలో పెడతామని అన్నారు. తాను జిల్లా మహబూబాబాద్ నుంచి వచ్చానని, ఖమ్మం, బోనకల్‌లో ఏఈఈగా పనిచేసి మహబాబాబాద్‌కు డీఈఈగా పదోన్నతి పొందానని, అక్కడి నుంచి ఈఈగా సత్తుపల్లి వచ్చినట్లు చెప్పారు.

## ప్రభుత్వ భూములు కాపాడాలి

తిరుమలాయపాలెం, జూలై 31: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆక్రమణలకు గురవుతున్న చెరవులు, కుంటలు, ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ అఖిలపక్షం నేతలు అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, చెరువుల, కుంటలు హద్దులు చెరిపి ఆక్రమించుకుంటున్నారని వాటిని కాపడాలని కోరారు. అలాగే తిరుమలాయపాలెంలో ప్రభుత్వ స్థలంలో బోర్డులు ఏర్పాటుఏసినా వాటిని తొలిగించి కొందరు వ్యక్తులు ఆక్రమించుకుని దర్జాగా అనుభవిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, కొలిచలంస్వామి, చింతిరాల నాగభూషణం, కొమ్ము పుల్లయ్య, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## జిల్లా సహకార అధికారి మురళీధరరావు ఉద్యోగ విరమణ

ఖమ్మంవ్యవసాయం, జూలై31: ఖమ్మం జిల్లా జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా సహకార అధికారి వంకాయలపాటి మురళీధరావు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. జిల్ల డీసీసీబీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన్ను సంబంధిత శాఖ ఉద్యోగులు మురళీధరారావు, భార్య విజయలక్ష్మిని ఘనంగా సన్మానించారు. అనంతరం 30 ఏళ్లనుంచి సహకారశాఖలో ఆయన చేసిన సేవలను కొనియడారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్, సహకారశాఖ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అన్నపునేని జగన్మోహన్‌రావు, ఉద్యోగులు నాగేశ్వరరావు ఈగ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు సీహెచ రవికుమార్, జి.ఉషశ్రీ, సందీప్‌కుమార్.టి.వెంకటేశ్వర్లు, సహకార శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సాగునీటి విడుదలపై నేడు వైరాలో అఖిలపక్ష రైతుల సమావేశం

వైరా, జూలై 31: వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు సాగునీరు విడుదలకు సంబంధించి చర్చించేందుకు గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అఖిలపక్ష రాజకీయ, రైతుసంఘాలు, అన్నివర్గాల రైతులతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సూచనల మేరకు సమావేశాన్ని గురువారం ఉదయం పది గంటలకు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. వైరా ఆయకట్టుకు రిజర్వాయర్ నుంచి నీరు విడుదలచేసే విషయంలో ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టిసారించారన్నారు. ఈనెల మొదటి వారంలోనే నీరు విడుదల సాధ్యసాధ్యాలను చర్చించేందుకు ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి అన్ని పార్టీల నాయకులు, రైతుసంఘాల ప్రతినిధులు, రైతులు హాజరుకావాలని కోరారు.

## బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలి: డీఎం

ఖమ్మం రూరల్, జూలై 31: దివ్యాంగులందరూ 50 శాతం రాయితీలో టీజీఎస్ ఆర్టీసీ అందజేస్తున్న బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం డిపో మేనేజర్ దినేష్ కోరారు. మండల పరిదిలోని జలగంనగర్‌లోని ఐకేపి కార్యాలయంలో 50 శాతం రాయితీతో దివ్యాంగులకు అందజేస్తున్న బస్‌పాస్ మేళను బుధవారం ప్రారంబించారు. బస్‌పాస్ మేళకు వచ్చిన దివ్యాంగులకు బస్‌పాస్‌లను అందజేశారు. దినేష్ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేటినుంచి తల్లిపాల వారోత్సవాలు: సీడీపీవో

కారేపల్లి, జూలై 31: మండల పరిధిలో అన్నిఅంగన్‌వాడీ కేంద్రలలో గురువారం నుంచి తల్లి పాలవారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో దయమణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యతను చాటలన్నారు.కార్యక్రమంలో ప్రతిఒక్కరు పాల్గొని అవగాహన కల్పించాలన్నారు.

## బదిలిపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

కామేపల్లి, జులై 31: కామేపల్లి మండల పరిదిలోని ఎంజేపల్లి ప్రభుత్వ పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయులకు ఘనంగా బుధవారం ఘనంగా సన్మాన కార్యక్రమం చేపట్టారు. సైన్స్ ఉపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి, స్కౌట్ మాస్టర్ రఘు కుమార్, రికార్డు అసిస్టెంట్ రంజాన్ బదిలీపై వివిధ పాఠశాలలకు వెళ్లారు వారిని పూర్వ విద్యార్థుల సంఘం, విద్యార్థులు సన్మానం చేశారు. హెచ్ఎం వెంకట్, కామేశ్వరరావు, కృష్ణ, శ్రీనివాసశర్మ, స్వర్ణలత, గంగ ఉన్నారు.